


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 07 | సంచిక : 353 | అమలాపురం | ఎడిటర్ :కె. సునీల్‌కుమార్ | శనివారం | 24 ఆగస్టు 2024 | పేజీలు : 12 | వెల : 2/-

## పచ్చపచ్చగా పల్లెలుండాలి





- 4,500 కోట్లతో 'ఉపాధి'
- రాష్ట్రంలో 54 లక్షల కుటుంబాలకు తొమ్మిది కోట్ల పనిదినాల కల్పన
- తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు..
- గ్రామాల అభివృద్ధికి రూ.2,100 కోట్లు
- 2014-19 మధ్య మాది స్వర్ణయుగం..
- 2019-24 మధ్య వైసీపీది చీకటి రాజ్యం
- కోనసీమ జిల్లా స్వర్ణవానపల్లి గ్రామ సభలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- వచ్చే ఐదేళ్లలో పల్లె ప్రగతికి బాటలు..
- 17,500 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం
- 10,000 కిలోమీటర్ల మురుగు కాల్వల నిర్మాణం
- 2,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు
- 5,00,000 పంట కుంటల తవ్వకం
- 4,00,000 ఉపాధి పనుల కల్పన

**అమలాపురం/కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో గ్రామ సీమలకు తిరిగి పూర్వ వైభవం తేవడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒకే రోజు 13,326 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించామని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి వాటిని తీర్చడమే లక్ష్యమని.. కాంట్రాక్టర్ల అవసరాలు తీర్చేందుకు కాదని స్పష్టం చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట పరిధిలోని స్వర్ణవానపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేగా నిధులతో రూ.4,500 కోట్ల అంచనా వ్యయంతో 87 రకాల పనులకు గ్రామసభల ద్వారానే ఆమోదం పొందుతున్నామని చెప్పారు. ఉపాధి పనుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 54 లక్షల కుటుంబాలకు 9 కోట్ల పనిదినాలు కల్పిస్తున్నామని, తద్వారా అందరికీ ఉపాధి లభిస్తుందన్నారు. "ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ ఏంచేసిందో చూశారు. పోలింగ్ సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించారు. అయినా ప్రజలు కూటమి పార్టీలకే అండగా నిలిచారు. మాకు 93 శాతం సీట్లు ఇచ్చారు. 57 శాతం ఓట్లు వేశారు. అయినా.. వైసీపీ భూతం వేలాడుతోంది. దానిని భూస్థాపితం చేయాలి. అప్పుడే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది" అని చంద్రబాబు తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ నేతలనుగానీ, మాజీ ముఖ్యమంత్రిని గానీ ఏనాడు తాము మిగతా 2లో..

## అంబానీ బ్రదర్‌కు భారీ షాక్




**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీకి ఇవాళ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ హోం ఫైనాన్స్ అక్రమాలపై స్టాక్ ఎక్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ)కొరడా ఝుళిపించింది. అనిల్ అంబానీపై ఐదేళ్ల పాటు ట్రేడింగ్ మిగతా 2లో..

## ఎన్ కన్వెన్షన్ కూల్చివేత..!



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు తెలంగాణ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. మాదాపూర్‌లోని తుమ్మిడికుంట చెరువును కబ్జా చేసి నాగార్జున ఎన్‌కన్వెన్షన్ హాల్‌ను నిర్మించారనే మిగతా 2లో..

## కులం టార్గెట్ కాకపోతే అట్రాసిటీ చట్టం వర్తించదు



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ వ్యక్తులకు జరిగిన ప్రతీ అవమానం, బెదిరింపు వ్యాఖ్యలు ఆ వర్గాలపై అఘాయిత్యాల నిరోధక చట్టం కిందకు రాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ పీబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఒక కేసులో ఈ చట్టానికి సంబంధించి వ్యాఖ్యానం చేసింది. మరునాదన్ మలయాళీ యూట్యూబ్ చానెల్ ఎడిటర్ మిగతా 2లో..

## నెల్లూరు రూరల్ డీఎస్పీ నీ ఢీ కొట్టిన వాహనం






**నెల్లూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** జాతీయ రహదారిపై బొలెరో వాహనంలో భారీ ఎత్తున గంజాయి తరలిస్తున్నారు అన్న సమాచారం మేరకు రాత్రి డ్యూటీలో ఉన్న నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, వెంకటాచలం సిఐ సుబ్బారావు మనుబోలు ఎస్సై అజయ్ మరి కొంత మంది పోలీస్ సిబ్బంది గత రాత్రి సుమారు ఒకటిన్నర ప్రాంతంలో నెల్లూరు జిల్లా వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన ఒక బొలెరో వాహనాన్ని ఆపి మాట్లాడుతుండగా డి.ఎస్.పి ఆ వాహనాన్ని పట్టుకొని నిలబడి వున్న సమయంలో నిందితుడు మిగతా 2లో..

### స్వయంశక్తి పాలన ప్రగతితో సాకారం కావాలి

## 'స్వర్ణ పంచాయతీ'

- పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలి.. త్వరలో గ్రామ సభల తరహాలోనే రెవెన్యూ సభలు
- ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై కొత్తగా గూండా యాక్ట్ తెచ్చే యోచన చేస్తాం
- మైసూరువారిపల్లె గ్రామసభలో పాల్గొని ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** 'మన గ్రామంలో ఏం చేసుకోవాలి.. ఏ పనులు పూర్తి కావాలి.. ఎలా పుట్టిన గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకోవాలి? అనే ఆలోచన ఆయా గ్రామాల్లోని ప్రతి ఒక్కరికి ఉండాలి. గ్రామ సభల్లో గ్రామానికి అవసరం అయ్యే పనుల మీద గ్రామస్తులంతా మిగతా 2లో..





## నేపాల్‌లో బస్సు నదిలోకి దూసుకెళ్లి.. 27 మంది భారతీయుల మృతి



**కాఠ్మాండూ :** నేపాల్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. పర్యటకులతో వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు నదిలోకి దూసుకెళ్లడంతో 27 మంది భారతీయులు మిగతా 2లో..

## వక్ఫ్ సవరణ బిల్లుకు నితీశ్ ఎర్ర జెండా



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు మిగతా 2లో..

### బ్లాస్ట్ తర్వాత సహాయ పనుల్లో

## ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఫార్మా కంపెనీ బ్లాస్ట్ ఘటనపై లోతైన దర్యాప్తు చేయాలి.. ఇకనైనా పరిశ్రమల్లో సేఫ్టీ మెజర్స్‌పై పక్కాగా దృష్టి పెట్టాలి
- భవిష్యత్తులో ఇలా ప్రమాదాలు జరగకుండా చూడాలి
- కంపెనీ బస్సుల్లోనే బాధితులను ఆస్పత్రికి తరలించారు : వైయస్ జగన్ స్పష్టీకరణ



**అనకాపల్లి, విశ్వంవాయిస్ న్యూస్ :** అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా కంపెనీలో బ్లాస్ట్ తర్వాత ప్రభుత్వ స్పందన ఏ మాత్రం సక్రమంగా లేదు. ఘటనపై స్పందించకూడదు అన్న తాపత్రయం ప్రభుత్వంలో కనిపించింది. 17 మంది చనిపోయిన దుర్ఘటనపై ఆరోజు సా.4 గం.కు మీడియాతో మాట్లాడిన హోం మంత్రి సహాయక చర్యల పర్యవేక్షణకు తాను ఘటనా స్థలానికి వెళ్తున్నట్లు చెప్పలేదు. మరో గంటకు మీడియాతో మాట్లాడిన కార్మిక శాఖ మంత్రికి కనీస సమాచారం లేదు. ప్రమాదం జరిగిన తర్వాత ఘటనా స్థలానికి కలెక్టర్ ఎప్పుడు మిగతా 2లో..



## ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తారా?



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** రానున్న జమ్మూ-కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్‌లు పొత్తు కుదుర్చుకోవడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. అధికారంపై యావతో దేశ భద్రత, సమగ్రతను ఫణంగా పెట్టి ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని విమర్శించారు. పాకిస్థాన్‌తో చర్చలను మిగతా 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## భారీ షాక్

నిషేధం విధించడంతో పాటు రూ.25 కోట్ల జరిమానా కూడా విధించింది. అనిల్ అంబానీకి చెందిన 24 కంపెనీలపై ఐదేళ్ల పాటు సెబీ నిషేధం వర్తించనుంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ మాజీ ముఖ్య అధికారులతో సహా పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ మరియు 24 ఇతర సంస్థలను సెక్యూరిటీస్ మార్కెట్ నుండి ఐదేళ్లపాటు ట్రేడింగ్ చేయకుండా నిషేధించింది. ఐదేళ్ల పాటు రెగ్యులేటర్‌లో నమోదైన ఏదైనా లిస్టెడ్ కంపెనీ లేదా మధ్యవర్తిగా డైరెక్టర్ లేదా కీ మేనేజర్ పర్సనల్ గా సేవలందించడంతో పాటు సెక్యూరిటీస్ మార్కెట్‌తో ఎలాంటి అనుబంధం లేకుండా నిషేధించింది. తన 222 పేజీల తీర్పులో సెబీ.. అనిల్ అంబానీ, %=ఎఖీా% టాప్ ఎగ్జిక్యూటివ్‌లు %=ఎఖీా% నుండి అతనికి సంబంధించిన సంస్థలకు రుణాల ముసుగులో నిధులను మళ్లించడానికి ఒక మోసపూరిత కుట్ర చేసినట్లు నిర్ధారణకు వచ్చింది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అలాంటి రుణ విధానాలను నిలిపివేయాలని, కార్పొరేట్ రుణాలను క్రమం తప్పకుండా సమీక్షించాలని సంస్థ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, యాజమాన్యం ఈ సూచనలను విస్మరించిందని తెలిపింది.ఈ కుట్రను అనిల్ అంబానీ, అతని కంపెనీ యొక్క కీ మేనేజర్లు అమలు చేసినట్లు సెబీ తెలిపింది.

## ఎన్ కన్వెన్షన్ కూల్చివేత..!

ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పత్యేకంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు ఈ నిర్మాణం పైనా ఫిర్యాదుల వచ్చాయి. ఎన్ కన్వెన్షన్ ను తాకుతూనే చెరువు నీళ్లు ఉంటాయి. దీంతో, ఈ నిర్మాణం కు సంబంధించి హైడ్రా పూర్తి వివరాలు సేకరించింది. ఈ రోజు ఎన్ కన్వెన్షన్ కూల్చివేత పనులు ప్రారంభించింది. హైదరాబాద్ లో అక్రమ కట్టడాలపైన హైడ్రా ఫోకస్ చేసింది. నగరంలో ఆక్రమణల తొలిగింపు పైన దూకుడుగా వ్యవమరిస్తోంది. కేటీఆర్‌కు చెందినదిగా భావిస్తున్న జవ్వాడ ఫామ్ హౌస్ అక్రమం అంటూ కూల్చివేయడానికి రంగం సిద్ధమైంది. అయితే దీనికి వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారు.ఇదే సమయంలో హీరో అక్కినేని నాగార్జున కు చెందిన ఎన్ కన్వెన్షన్ పైన ఫిర్యాదులు ఉన్నాయి. తమ్మిడి చెరువులో 3 ఎకరాల 30 గుంటలను ఆక్రమించి ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించారని హైడ్రా గుర్తించింది. గతంలోనే ఈ రకమైన ఫిర్యాదులు ఉన్నా..అప్పట్లోనే కూల్చివేస్తారనే ప్రచారం జరిగినా..చివరి నిమిషంలో కూల్చివేతలు ఆగిపోయాయి.

## చట్టం వర్తించదు

షాజన్ షకీరాపై ఇదే చట్టం కింద నమోదైన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేసింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కేరళ ఎమ్మెల్యే పీవీ శ్రీనిజన్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యానాలు చేస్తూ వీడియోను అప్‌లోడ్ చేశారన్నది షాజన్ షకీరా మీద అభియోగం. బాధితుడు ఎస్సీ లేదా ఎస్టీ అన్న ఒకే ఒక కారణంతో అవమానించిన వాడి మీద సదరు చట్టం వాడటం కుదరదని జస్టిస్ పార్ధీవాలా స్పష్టం చేశారు. బాధితుడు ఎస్సీ లేదా ఎస్టీ అన్న కారణంతోనే ఉద్దేశపూర్వకంగా అవమానం లేదా బెదిరింపునకు పాల్పడినపుడే ఆ చట్టం వర్తిస్తుందని తెలిపారు. అంటే, బాధితుడు ఎస్సీ లేదా ఎస్టీ అనే ఒకే ఒక కారణంతో అవమానించి లేదా బెదిరించి ఉంటేనే ఈ చట్టం వర్తిస్తుందని విశదీకరించారు. కేరళ ఎమ్మెల్యే విషయంలో యూట్యూబర్ అలా చేసినట్లు అతని వ్యాఖ్యల్లో కానీ, కథనంలో కానీ ఎక్కడా కనిపించలేదని అన్నారు.

## ఢీ కొట్టిన వాహనం

ఒక్కసారిగా వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో అదుపుతప్పి కింద పడిపోయిన డిఎస్పి నుదుటికి గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో పోలీసులు ఒక్కసారి దిగ్భ్రాంతికి గురై డిఎస్పికి వైద్యం అందించాలనే తాపత్రయంతో ఉండగా నిందితుడు అతివేగంగా టోల్ ప్లాజా ను ఢీ కొట్టి గూడూరు వైపు వెళ్లిపోయాడు, దీంతో అప్రమత్తమైన పోలీసులు నిందితుడు వాహనానికి సంబంధించిన సమాచారం అన్ని పోలీస్ స్టేషన్ లకు అందివ్వడంతో పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## పల్లెలుండాలి

అడ్డుకోలేదన్నారు.

**ఏనాడైనా గ్రామ సభలు పెట్టారా? :** "కొందరు సైకోలు ఐదేళ్ల పాలనను అధ్వానంగా కొనసాగించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడైనా ఇలా గ్రామ సభలు పెట్టారా? ముఖ్యమంత్రిగాని, డిప్యూటీ సీఎంగానీ మీ ముందుకు వచ్చి మాట్లాడారా? ఒకవేళ వారు వస్తే పచ్చదనం కనిపించకూడదు. చెట్లన్నీ నరికేయాలి. పరదాలు కట్టాలి. వానపల్లిలోని పళ్లాలమ్మ గుడి వద్ద కూడా ఇదే స్థాయిలో విధ్వంసం చేశారు" అని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఆనాటి ప్రభుత్వంలో సభలకు వచ్చే మహిళలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. "మాది సింపుల్ గవర్నెన్స్.. సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నమెంట్" అన్నారు. "నెత్తిమీద రూపాయిపెట్టి వేలం వేస్తే ఎవరూ కూడా ఆ వ్యక్తిని కొనరు" అని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు మొత్తంగా గంటా 20 నిమిషాలపాటు అనర్గళంగా ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే..

**సర్పంచ్‌లను డమ్మీ చేశారు :** రాష్ట్రంలో 2014-19 మధ్య మా హయాంలో 27,444 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశాం. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో 6,643 కిలోమీటర్ల సీసీ రోడ్లే నిర్మించింది. మా హయాంలో గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే చెత్త ద్వారా కేంద్రాలు పెట్టి ఆదాయం సృష్టిస్తే.. వైసీపీ హయాంలో ఆ చెత్తను రోడ్లపై వేసి.. మరుగుదొడ్ల మాదిరిగా రోడ్లను మార్చేశారు. 9,590 కేంద్రాలను ఏర్పాటు చేసి రంగులు వేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మా హయాంలో 25.22 లక్షల ఎల్ఈడీ బల్బులు వెలిగిస్తే.. వైసీపీ హయాంలో 40 శాతం బల్బులు వెలగకుండా చేశారు. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా చేసిన ఘనత వైసీపీదే. వారి అధికారాలను హరించారు. గ్రామాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి ఇష్టానుసారం స్వాహా చేశారు. మా ప్రభుత్వం వచ్చిన కొన్ని రోజుల్లోనే రూ.2100 కోట్లను గ్రామసీమల అభివృద్ధికి విడుదల చేశాం. 3.67 లక్షల హార్టికల్చర్ పనులు చేశాం. సోషల్ ఆడిట్‌లు చేశాం. ఎన్టీఆర్ జలసిరి ద్వారా 32,693 బోర్లు ఏర్పాటు చేశాం. వచ్చే ఐదేళ్లలో ప్రతి గ్రామంలోను సీసీ రోడ్లతోపాటు మురుగునీటి కాల్వలను ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. ఇవి కాకుండా పశువులు, మేకలు, మూగజీవాల కోసం షెడ్ల నిర్మాణం చేపడతాం. ఉపాధి కూలీలకు ఆదాయం పెరిగేలా దినసరి వేతనాన్ని పెంచి ఆదుకుంటాం.గ్రామాల్లో ఇంటిస్థలం లేనివారికి 3 సెంట్లు చొప్పున భూమి ఇస్తాం. వానపల్లిలో 610 మందికి ఇళ్లు లేవని చెప్పారు. వారందరికీ స్థలాలు ఇస్తాం. ప్రజల ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే అన్ని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది. పిల్లల చదువు కోసం ఏ సౌకర్యాలు కావాలో అన్నీ కల్పిస్తాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులన్నింటినీ అధ్వాన స్థితికి తీసుకువచ్చారు. దీంతో ప్రజలు నేటికీ పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిన ఘనత వైసీపీదే. కూటమి తరఫున గెలిచిన 21 మంది ఎంపీలు కేంద్రంలో కీలకమయ్యారు. వారి కృషి ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వ రాజముద్రతో మళ్లీ పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసే బాధ్యత తీసుకున్నాం.

**ప్రజలు ఇస్తేనే 'హోదా' :** ల్యాండ్ టైట్లింగ్ యాక్టు అమలు చేయాలనే వైసీపీ ప్రభుత్వ వ్యూహం చూసి నాకే భయమేసింది. ఆ చట్టంతో నా భూమి నాకే దక్కకుండా పో తుంది. అందుకే దాన్ని రద్దు చేశాం. అలాంటి భయంకర చట్టాలు తెచ్చా రు. ప్రజలు ఇస్తే వచ్చేది హోదా(వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదాను ప్రస్తావిస్తూ).. ప్రజలు గెలిపిస్తే వచ్చేది పదవి. బెదిరిస్తేనో, నేరాలు చేస్తేనో పదవులు, హోదాలురావు అనే విషయాన్ని గుర్తెరగాలి. ప్రతి నెల 1న 'పేదల సేవలో ప్రభుత్వాధికారులు' అనే లక్ష్యంతో పింఛన్ల పంపిణీ చేపట్టి దిగ్విజయంగా పూర్తిచేశాం. సంపద సృష్టిస్తాం. ఆ సంపదను పేదవారికి పంపిణీ చేస్తూనే ఉంటాం. ఉద్యోగులకు కూడా మొదటి తేదీనే జీతాలు ఇచ్చాం. ఉచిత ఇసుక విధానాన్ని మరింత సులభతరం చేస్తాం. ఇటీవల రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లిం చాం. 48 గంటల్లోనే ధాన్యం బకాయిలు చెల్లించే విధానాలు తెస్తున్నాం. స్వర్ణ వానపల్లి గ్రామంలో రూ.10 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి గ్రామసభ ఆమోదం పొందారు. వాటన్నింటినీ పూర్తిచేసే బాధ్యత మేం తీసుకుంటాం.

**వైసీపీ దోపిడీతో ఢిల్లీలోనూ అవమానం :** ఇక్కడే పోలవరం ఉంది. జగన్ హయాంలో డయాఫ్రం వాల్‌ను ధ్వంసం చేశారు. 2021కి పూర్తి కావాల్సిన ప్రాజెక్టు పడకేసింది. మొ న్నే ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రిని కలిసి ఒప్పించాం. ఈ దుర్మార్గుడు(జగన్) చేసిన పనితో మళ్లీ డయాఫ్రం వాల్ కట్టాలి. గతంలో రూ.440 కోట్లతో పూర్తిచేసిన వాల్ పోయింది. ఇప్పుడు రూ.990 కోట్ల భారం పడుతోంది. వైసీపీ హయాంలో కేంద్రం వివిధ పథకాలకు వేల కోట్లు ఇచ్చింది. కానీ, వాటిని మళ్లించి, దుర్వినియోగం చేసి.. లెక్కా, పత్రం లేకుండా చేశారు. మొన్న ఢిల్లీకి వెళ్తే మీ రాష్ట్రానికి ఇచ్చిన డబ్బులకు లెక్కలు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇది ఎంత అవమానం!!

**మాది 'భవిత' :** 2014-19 మధ్య మా హయాంలో స్వర్ణయుగాన్ని చూశారు. 2019-24 మధ్య చీకటి రాజ్యాన్ని చవిచూశారు. నరేగాతో సహా ఉపాధి హామీ పనుల సొమ్ములు దుర్వినియోగమయ్యాయి. మా ప్రభుత్వం ఎప్పుడూ తాగునీటికి, సిమెంటు రోడ్లకే ప్రాధాన్యం ఇస్తుంది. ఎమ్మెల్యే ఎంత ముఖ్యమో, గ్రామానికి సర్పంచ్ కూడా అంతే ముఖ్యం.

**వారిది 'భూతం' :** ఎన్నికల్లో కూటమి పార్టీలకు 57 శాతం మంది ఓట్లు వేశారు. 93 శాతం సీట్లు కట్టబెట్టారు. రాష్ట్రానికి పట్టిన శనిని పారదోలారు. ఇప్పుడు వైసీపీ భూతం తయారై వేలాడుతోంది. దాన్ని భూస్థాపితం చేయాలి. దీనికి ప్రజలంతా సంఘటితం కావాలి.

## 'స్వర్ణ పంచాయతీ'

సమగ్రంగా చర్చించాలి. అంతా ఒక్కటిగా తీర్మానాలు చేసుకొని గ్రామ అభివృద్ధిని, ప్రగతికి ముందుకు నడిపించే చైతన్యం ఉన్నప్పుడే గ్రామాలు సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తాయ'ని ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారు అన్నారు. స్వర్ణ పంచాయతీలుగా మారి సంపన్న ఆర్థిక, అభివృద్ధి ప్రగతి సాధించేలా పటిష్టమైన ప్రణాళికను గ్రామస్తులే రూపొందించుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. గ్రామ పంచాయతీ మొదటి పౌరుడు అయిన సర్పంచులకు విశిష్టమైన శక్తి, అధికారాలు ఉన్నాయని, దానిని సరైన రీతిలో ఉపయోగించుకుంటే ప్రతి గ్రామం రాలేగావ్ సిద్ధిగా మారుతుందని అభిలషించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13,326 గ్రామపంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పవన్ కళ్యాణ్ అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం, మైసూరువారి పల్లె గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రామ సభను మైసూరవారి పల్లె గ్రామ సర్పంచి శ్రీమతి కారుమంచి సంయుక్త ప్రారంభించి పంచాయతీ నిధులను, చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం పంచాయతీలో రూ.38.46 లక్షలతో చేయాల్సిన 43 రకాల పనులు గురించి తీర్మానాలను చేశారు. గ్రామస్తులు ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం ఎవరు పోటీలో నిలబడలేని, ప్రతికూల పరిస్థితులను ఎదిరించి ఓ ఆర్మీ జవాన్ భార్యగా శ్రీమతి కారుమంచి సంయుక్త గారు పోటీలో నిలవడమే కాకుండా గెలవడం ఆమె తెగువకు నిదర్శనం. ఆమె ధైర్యం నన్ను కదిలించింది. అందుకే గ్రామ సభను ఇక్కడ నిర్వహించాలని భావించాం. ఇంట్లో ఆడపిల్ల చదివితే ఆ ఇంటికి వెలుగు అంటారు. అదే ఆడ పిల్ల చదివితే దేశానికి కూడా వెలుగు. పంచాయతీల నుంచే భారతదేశ రాష్ట్రపతిగా ఎదిగిన శ్రీమతి ద్రౌపది ముర్ము గారి ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. గ్రామ పంచాయతీల నుంచి బలమైన నాయకులు దేశానికి తయారవుతారు. అందుకే గ్రామాల నుంచి దేశభక్తి ఉప్పొంగాలనే ఉద్దేశంతో జాతీయ పండుగలను వైభవంగా జరిపేందుకు మేజర్, మైనర్ పంచాయతీలకు నిధులను భారీగా పెంచాం.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి ప్రాధాన్యం :**

ప్రస్తుత గ్రామ పంచాయతీ సర్పంచులుగా వైసీపీకి చెందిన వారు ఎక్కువ మంది ఉన్నారు. మొత్తం రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో 70 శాతం పైబడి వైసీపీకి చెందిన వారే ఉన్నారు. మేం రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి వైపు అడుగులు వేయాలని బలంగా సంకల్పించాం. గ్రామాల అభివృద్ధి బాగుంటేనే రాష్ట్ర అభివృద్ధి, దేశాభివృద్ధి బాగుంటుందని నేను నమ్ముతాను. దానికి అనుగుణంగానే గ్రామాలను బలోపేతం చేసేందుకు ముఖ్యంగా ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు ప్రయాణం మొదలుపెట్టాం. ఇటీవల ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు భారీగా నిధులను పెంచి సర్పంచులు సగర్వంగా పండుగను జరుపుకొనేలా చేశాం. దీనిలో ఎక్కువ మంది వైసీపీ సర్పంచులే ఉన్నా మేం రాజకీయాలను పట్టించుకోలేదు. అన్ని పంచాయతీలకు నిధులు అందేలా చూసాం. ప్రస్తుతం కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 991 కోట్లు వచ్చాయి. ఎలాంటి కోతలు, మళ్లింపులు లేకుండా పంచాయతీల అకౌంట్లో నిధులను జమ చేశాం. స్వర్ణ పంచాయతీలు చేయడానికి ఆర్థికంగా వాటికి బలాన్ని అందించే కార్యక్రమాన్ని, పంచాయతీల్లోని వనరులను ఉపయోగించుకుని ముందుకు వెళ్లే కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వద్ద అల్లావుద్దీన్ అద్భుత దీపం లేదుగానీ బలమైన సంకల్ప బలం, చిత్తశుద్ధితో కూడిన పాలన ఉంది. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలనే ఆలోచనతో, గ్రామాలకు మళ్లీ పునర్ వైభవం రావాలని బలమైన ఆశయంతో పని చేస్తున్నాం.

**గత ప్రభుత్వంలో పెట్టిన ఖర్చులకు లెక్కే తెలీదు :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.41 వేల కోట్ల పనులు చేశారు. అయితే వీటికి లెక్కాపత్రం లేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే కేవలం రూ.15 వేల కోట్ల పనులు మాత్రమే కనిపిస్తున్నాయి. మిగిలిన నిధులు ఏమయ్యాయో, ఎలా ఖర్చు చేశారో కూడా తెలీదు. దీనికి కారణం ఒక్కటే. గ్రామసభలను నిర్వహించకుండానే ఇష్టానుసారం పనులు చేయడం వల్ల గ్రామాల్లో జరిగిన పనులే చాలా చోట్ల సర్పంచులకు కూడా తెలీని పరిస్థితి ఉంది. రోడ్లు, మౌలిక వసతులు తప్ప ఇతర పనుల జాడ లభించడం లేదు. గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో చేసుకోవాల్సిన పనులు, వాటి ప్రాధాన్యం గురించి చర్చించి తీర్మానాలు చేసినప్పుడే నిధుల వినియోగం మీద స్పష్టత వస్తుంది.

**చదువుల నేల రాయలసీమ :** రాయలసీమ విద్యల నేల. అత్యధిక గ్రంథాలయాలున్న నేల. ఇక్కడ యువతకు ఉన్న శక్తి అపూర్వం. కర్నూలులో సుగాలి ప్రీతికి అన్యాయం జరిగిందని నేను పోరాటం చేస్తే నాతో లక్షలాదిగా ఇక్కడ యువత కదిలారు. అన్యాయంపై పోరాటగల నైజం రాయలసీమ యువతకు సొంతం. నేను ఎన్నికల సభలకు రైల్వే కోడూరు వచ్చిన తర్వాత ఇక్కడి యువత స్వాగతం చూసి.. కచ్చితంగా కూటమి ప్రభుత్వం రాబోతోందని బలంగా భావించాను. రాయలసీమ యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరగాలి. ఉద్యాన పంటలకు సంబంధించిన పరిశ్రమలు రావాలి. అలాగే మంగంపేట బైరెటీస్ గనుల్లో స్థానిక యువతకు తగిన ప్రాధాన్యత అందేలా చూస్తాం. దీంతో పాటు ఇక్కడి యువత తగిన నైపుణ్యాలను సాధించేందుకు స్కిల్ యూనివర్శిటీ ప్రతిపాదనను సీఎం దృష్టికి తీసుకెళ్తాం. స్థానికంగా ఉపాధి పెరిగితే గల్ఫ్ దేశాలకు వలసలు తగ్గుతాయి. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పాలన అనుభవం గొప్పది. ఆయన ఆధ్వర్యంలో పని చేస్తూ పాలన అనుభవం నేర్చుకుంటాను. మంచి ఎక్కడున్నా నేర్చుకు నేందుకు నేను నిరంతరం తపన పడతాను. ఈ రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే సమర్థు లైన బోలెడుమంది నాయకుల అవసరం ఉంది. దానికి అనుగుణంగానే ముందకు వెళ్తాం.

## ప్రభుత్వ నిర్లక్ష్యం

వెళ్లారు? అధికారులు ఎప్పుడు వెళ్లారు? కమిషనర్ ఎప్పుడు వెళ్లారన్నది గమనిస్తే చాలా బాధ కలిగిస్తుంది. అంత తీవ్రస్థాయిలో ప్రమాదం జరిగినా తగిన సంఖ్యలో అంబులెన్సులు మొబిలైజ్ చేయకపోవడంతో కంపెనీ బస్సుల్లోనే బాధితులను ఆస్పత్రులకు తరలించారు.

**అదే ఆనాడు చూస్తే :** తమ ప్రభుత్వ హయాంలో, కోవిడ్ సంక్షోభ సమయంలో, 2020 మే నెలలో విశాఖలో ఎల్జీ పాలిమర్స్ దుర్ఘటన జరిగినప్పుడు ఎలా స్పందించామో.. తేడా మీరే చూడండి. ఆ ఘటన తెల్లవారు జామున 3.40 గం.కు జరిగితే ఉ.5 గం.కల్లా కలెక్టర్, కమిషనర్ సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే పెద్దసంఖ్యలో అంబులెన్సులు మోహరించి, ప్రతి బాధితుడికి తోడుగా నిల్చాం. ఉ.6 గం.కల్లా సీనియర్ నాయకులంతా ఘటనా స్థలానికి వెళ్లి, సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించారు. అదే రోజు ఉ.11 గం.కల్లా నేను స్వయంగా అక్కడికి చేరుకుని బాధితులను పరామర్శించాను. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఘటన తర్వాత కేవలం 24 గంటల్లోనే ఏకంగా కోటి రూపాయల పరిహారం అందించాం. అలా రూ.30 కోట్లు అందించి బాధితులకు తోడుగా నిలబడ్డాం. మరోవైపు అస్వస్థతకు గురైన వారందరినీ తక్షణమే ఆస్పత్రిలో చేర్చాం. మూడు రోజులు ఆస్పత్రిలో ఉన్న వారికి రూ.10 లక్షలు, ఆస్పత్రుల్లో చేరిన వారికి రూ.3 లక్షల పరిహారం అందించడంతో పాటు, స్వల్ప చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన వారందరికీ రూ.25 వేలు ఇచ్చాం. ప్రమాదం జరిగిన కంపెనీ చుట్టూ ఉన్న 5 గ్రామాల్లో 15 వేల మందికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేసి, వారికి తోడుగా నిలబడ్డాం. బాధితులు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఎలా స్పందించాలన్న దానికి ఇవన్నీ ఉదాహరణలు. తేడా గమనించమని కోరుతున్నాను.

**చంద్రబాబు. పరనింద :** అచ్యుతాపురం సెజ్ బ్లాస్ట్ తర్వాత, ఇక్కడికి వచ్చిన సీఎం చంద్రబాబు, గత మా ప్రభుత్వంపై నిందలు మోపి, సమస్య నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేశారు. మరి అంతకు ముందు 2014%-%19 మ్యధ్య చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలు జరగలేదా? జరిగాయి. దుర్ఘటనలు ఎప్పుడైనా, ఎవరి హయాంలో అయినా జరగొచ్చు. కానీ, ఆ ఘటన తర్వాత ప్రభుత్వం ఎలా స్పందించింది అనేది ముఖ్యం. బాధితుల పట్ల సానుభూతి చూపాలి. ఘటనకు బ్యాధ్యత తీసుకోవాలి. ఆరోజు, ఆ రెండూ మా ప్రభుత్వం చేసింది.

**సెక్యూరిటీ ప్రొటోకాల్ :** ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజ్ తర్వాత, ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆధ్వర్యంలో హైలెవెల్ కమిటీ వేసి ఫ్యాక్టరీ సెక్యూరిటీ, పొల్యూషన్ కంట్రోల్.. రెండూ క్రోడీకరించి, కంపెనీల్లో సెక్యూరిటీ ప్రొటోకాల్‌పై నివేదిక కోరాం. ఆ కమిటీ నివేదిక మేరకు, కంపెనీల్లో సెక్యూరిటీ ప్రొటోకాల్ నిర్ధారిస్తూ.. అదే ఏడాది ఆగస్టులో జీవో జారీ చేశాం. దాని ప్రకారం అన్ని రెగ్యులేషన్స్ వేర్వేరు లోకేషన్లలో కాకుండా.. అన్నీ క్రోడీకరించి, ఒకే చోటుకు తీసుకొచ్చాం. ఇంకా దాంట్లో ముఖ్యమైంది.. ప్రతి కంపెనీ కూడా సెల్ఫ్ కంప్లెయిన్స్ రిపోర్ట్ ఇవ్వాలి. ఒకవేళ ఆ నైపుణ్యం కంపెనీకి లేకపోతే.. అందుకోసం అక్రిడేటెడ్ థర్డ్ పార్టీ ఏజెన్సీని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ సెక్యూరిటీ ప్రొటోకాల్ ఇప్పుడూ అమల్లో ఉంది. దాన్ని ఈ ప్రభుత్వం మానిటర్ చేసి ఉంటే, ఇలాంటి ఘటనలకు తావుండేది కాదు.

**పాలనపై దృష్టి లేదు :** దురదృష్టవశాత్తూ ఈ ప్రభుత్వానికి పరిపాలనపై దృష్టి లేదు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, సూపర్ టెన్ పేరుతో ఇచ్చిన హామీల అమలుపైనా చిత్తశుద్ధి లేదు. వారి ధ్యాస అంతా రెడ్‌బుక్ పరిపాలనపైనే. ఎక్కడికక్కడ రెడ్‌బుక్ తెరవడం.. ప్రత్యర్థులపై కక్ష తీర్చుకోవడం కోసం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం. అదే రెండున్నర నెలల నుంచి ఈ ప్రభుత్వ పాలన. అవన్నీ కాకుండా, ఈ ప్రభుత్వం పరిశ్రమల్లో సెక్యూరిటీ ప్రొటోకాల్‌పై దృష్టి పెట్టి ఉంటే, ఇలాంటి ప్రమాదాలు జరిగేవి కావు. ఇలా కార్మికులు బలయ్యే వారు కారు.

## 27 మంది భారతీయుల మృతి

మరణించారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా మహారాష్ట్రకు చెందిన వారుగా తెలుస్తోంది. మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాకు చెందిన 104 మంది భక్తులు విహారయాత్ర కోసం పది రోజుల క్రితం మూడు బస్సుల్లో నేపాల్ వెళ్లారు. శుక్రవారం ఉదయం నేపాల్‌లోని పొఖారా నుంచి కాఠ్మాండూకు బయలుదేరారు. తనహూన్ జిల్లా సమీపంలోని ఐరాపహోర్ ప్రాంతంలో ప్రయాణికుల బస్సు అదుపుతప్పి 150 మీటర్ల మర్స్యంగ్డి నదిలో పడింది. ఆ సమయంలో బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నారు. "ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నంబరు ప్లేట్‌తో ఉన్న ఓ ట్రావెల్స్ బస్సు కాఠ్మాండూలోని తనహూన్ జిల్లా సమీపంలో నదిలో పడింది. కొండప్రాంతంలో అదుపుతప్పి 150 మీటర్ల లోతులోగల మర్స్యంగ్డి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 27 మంది మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆర్మీ, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. 16 మందిని రక్షించాం. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాం" అని నేపాల్ అధికారులు తెలిపారు. కాగా, గత నెలలో కొండచరియలు విరిగిపడటంతో రెండు బస్సులు నదిలోకి దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు మరణించారు.

## నితీశ్ ఎర్ర జెండా

బీజేపీ మిత్రపక్షాల్లో కీలకంగా మారిన జేడీయూ కూడా ఎర్ర జెండా చూపింది. ఇప్పటికే లోక్ జన్‌శక్తి(రామ్ విలాస్) పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ ఈ బిల్లుపై ప్రశ్నలు సంధించారు. దీంతో బీజేపీ మిత్రపక్షాల్లోనే ఈ బిల్లును వ్యతిరేకించిన మరో పార్టీగా జేడీయూ నిలిచింది. ముస్లింల ప్రయోజనాలను కాపాడేందుకు బిల్లులో మార్పులు చేయాలని జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ డిమాండ్ చేసినట్టు తెలిసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్ రాష్ట్రంలో 18 శాతం వరకు ముస్లిం జనాభా ఉంది.

## పునరుద్ధరిస్తారా?

పునఃప్రారంభించడం, జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక జెండా (ఎర్ర జెండా)ను, 370 అధికరణాన్ని పునరుద్ధరించడం వంటి అంశాలను నేషనల్ కాన్ఫరెన్స్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, వాటికి కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్టేనా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు ఆయన పది ప్రశ్నలను సంధించారు.

### ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామ సభ వేదికల మీద పలువురు

## రాజకీయ పార్టీల నేతలు



**రంపచోడవరం ( విశ్వం వాయిస్ న్యూస్ ప్రతినిధి ) :** గ్రామ స్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలు కలలు గానే మిగిలి పోతున్నాయి.... గ్రామ పంచాయితీ ల పాలన అంటేనే ఏ రాజకీయ పార్టీ కి సంబంధం లేనిది . ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా సర్పంచ్ ను , వార్డ్ సభ్యులను ఎన్నుకుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ రాజ్ శాఖ మంత్రి గా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత పంచాయతీ ల అభివృద్ధి కోసం 4500 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించి దేశ చరిత్ర లోనే ఎన్నడూ చూడని విధంగా ఓకే రోజు 13400 పైగా గ్రామ సభ సమావేశాలు ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు , అధికారులు పలు అభివృద్ధి తీర్మానాలు చేయాల్సిన సమావేశం లో గ్రామ సభ సమావేశాలు ఏర్పాటు చేసిన వేదిక మీదకు రాజ కీయ పార్టీల నాయకులు ను పెద్ద పీట వేసి పిలిచి మరి కూర్చోబెట్టడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. రంపచోడవరం మెజర్ పంచాయతీ లో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామ సభ లో పలువురు రాజ కీయ పార్టీల నేతలు వేదిక మీద ఆసినులయ్యారు. ఇలా గ్రామ సభ వేదికల మీద కూర్చోవడానికి ఇదేమి వాళ్ళ పార్టీ సమావేశం కాదు కదా కార్యకర్తల కు దిశా నిర్దేశనం చేయడం కోసం అను కోవడానికి. అసలు వాళ్ళకు ఏ అధికారం ఉందని దర్జాగా వేదిక మీద ఆశీనులయ్యారు ? అసలు వీళ్ళను వేధిక మీదకు ఆహ్వానించింది ఎవరు ? ఇది ప్రజా అవసరాలు తీర్చడానికి ప్రజా ప్రతినిధులు , అధికారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎర్పాటు చేసిన అధికారిక కార్యక్రమం అన్న సంగతి మర్చి పోయినట్టున్నారు. ఇక ఈ మొత్తం వ్యవహారం పై ప్రజలు బాహాటంగా నే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

## నూతన శ్రీ వివేకానంద స్కూల్ భూమిపూజ చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** పట్టణంలో శ్రీ వివేకానంద స్కూల్ నూతన భవనం నిర్మాణ కార్యక్రమానికి భూమి పూజ చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్. పట్టణంలో శ్రీ సిటీ లేహౌట్ ఆవరణంలో నూతనంగా నిర్మించే శ్రీ వివేకానంద స్కూల్ భవన నిర్మాణ కార్యక్రమానికి భూమి పూజ చేసిన మంత్రి సుభాష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ వివేకానంద విద్యాసంస్థలు ప్రారంభించి 34 సంవత్సరాలు అయిందని అన్నారు. అదేవిధంగా విద్య రంగంలో సాంకేతికపరంగా చోటు చేసుకుంటున్నా అధునాతన పరిజ్ఞానానికి అనుగుణంగా మార్పు చెందుతూ ముందుకు వెళ్లాలని శ్రీవివేకానంద కరస్పాండెంట్ సరోజినికి అభినందనలు తెలియజేశారు.అనంతరం వివేకానంద కరస్పాండెంట్ సరోజినీ మాట్లాడుతూ 1992లో మొట్టమొదటిసారిగా కాకినాడలో తమ స్కూలు స్థాపించడం జరిగిందన్నారు.అతికొద్ది కాలంలో ఇంద్రపాలెం, మధురానగర్,సామర్లకోట, రాయవరం, రామచంద్రాపురం లోతమ బ్రాంచ్ లను స్థాపించడం జరిగిందన్నారు.మా యొక్క అన్ని బ్రాంచులు సొంత భవనాల్లో ఉన్నాయి అని ఒక రామచంద్రపురం బ్రాంచ్ మాత్రమే ప్రైవేట్ భవనంలో ఉందని కొద్ది కాలంలోనే నూతన భవనం నిర్మించి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.ఈ ఈకార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్,వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ శైలుసా,అకాడమిక్ డీన్ వికాసా,ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపాలెంలో వియజయవంతమైన గ్రామ సభ



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్** రామచంద్రపురం నియోజవర్గం తాళ్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్రామ సభ పథకం ఉప సర్పంచ్ వల్లు శివ అధ్యక్షతన జరిగింది.ఆయన మాట్లాడుతూ ఈ గ్రామసభ ద్వారా పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించు కొవాలన్నారు. ఉపాధి హామీ పథకం వ్యవసాయ అనుబంధ పనులు నీటి సంరక్షణ పనులు మౌలిక సదుపాయాలు కల్పన మొదలైనవి గ్రామసభ ద్వారా పరిష్కరించుకోవచ్చని అదేవిధంగా అభివృద్ధి సంక్షేమం ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ రూపుదిద్దుకుంటుందని అన్నారు.

# గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి

**గ్రామ పంచాయతీలను మళ్లీ అభివృద్ధి బాట పట్టిస్తాం.. గత ప్రభుత్వం సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చింది**

**నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఎంత ముఖ్యమో...గ్రామాభివృద్ధికి సర్పంచి అంతే ముఖ్యం**


**మా ప్రభుత్వం రాగానే రూ.998 కోట్లు పంచాయతీలకు విడుదల చేశాం...మరో రూ.1,100 కోట్లు విడుదల చేయబోతున్నాం**

**ఉపాధి హామీ పని దినాలు 15 కోట్ల నుండి 21.50 కోట్లకు పెంపు.. సమాజానికి చేటు చేసే వ్యక్తులకు ప్రజలు దూరంగా ఉండాలి**

**ప్రతిపక్ష హోదా అనేది ప్రజలిచ్చేది...గెలిపిస్తే వచ్చేది...బెదిరిస్తే వచ్చేది కాదు... ఒకే రోజున 13,326 గ్రామసభలు చారిత్రాత్మకం**

**ఈ కార్యక్రమానికి పూనుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అభినందనలు : గ్రామసభలో సీఎం చంద్రబాబు నాయుడు**









**కొత్తపేట/వానపల్లి విశ్వంవాయిస్ న్యూస్ :** 'గ్రామాలు అభివృద్ధి చెందితేనే మనదేశం కూడా అభివృద్ధి చెందుతుంది. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు పంచాయతీలను నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో ఒక్క రోడ్డు కూడా వేయలేదు. కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను మళ్లీ అభివృద్ధి బాట పట్టిస్తాం. గ్రామాభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో ఏం చేస్తామో ఈ గ్రామ సభల ద్వారా మనం చర్చించుకున్నాం. రాష్ట్రంలో ఒకే రోజున 13,226 పంచాయతీల్లో గ్రామసభలు పెట్టుకున్నాం. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను అభినందిస్తున్నా. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఏ ద్వారా గ్రామసభలు పెట్టాలి. సర్పంచి పని చేయాలన్నా గ్రామసభ ఆమోదం ఉండాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజున గ్రామ సభలు పెట్టడం ఒక చరిత్ర. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో ఒక్కసారైనా గ్రామ సభ నిర్వహించి మాట్లాడారా? ఒక సీఎం, డిప్యూటీ సీఎం మీతో కలిసి సాదాసీదాగా మీ వద్దకు వచ్చి మాట్లాడారా? నాడు సీఎం వస్తున్నాడంటే చెట్లన్నీ నరికేయాలి, పరదాలు కట్టాలి. అందరిని అరెస్టు చేసి ఇంటి నుండి బయటకు రాకుండా చేశారు. స్కూళ్లన్నీ మూసేసి అన్ని బస్సులు ఆయన సమావేశాలకు మళ్లించారు. కానీ ఇప్పుడు మహిళలు స్వేచ్ఛగా వచ్చి సభలో కూర్చున్నారు. బలవంతంగా డ్వాక్రా సంఘాల ద్వారా జనాన్ని తీసుకొచ్చి నాడు ఇబ్బంది పెట్టారు...ఇప్పుడు ఆ పరిస్థితులన్నీ పోయాయి. గత ప్రభుత్వంలో సభకు వచ్చిన వాళ్లు వెళ్లిపోతుంటే అడ్డుకోవడానికి గోతులు తవ్వారు. ఇది ప్రజాస్వామ్యమా లేక నియంత కాలామా.? అందుకే చెప్తున్నా మాది సింపుల్ గవర్నమెంట్...ఎఫెక్టివ్ గవర్నెన్స్.' అని సీఎం నారా చంద్రబాబు అన్నారు. కోనసీమ అంబేద్కర్ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, వానపల్లి గ్రామంలో స్వర్ణగ్రామం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు.

**గత ప్రభుత్వంలో నరేగా బిల్లులు సొంత జేబుల్లోకి**

'మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి ఈ సభ ద్వారా రూ.4,500 కోట్లు మంజూరు చేస్తున్నాం. రాష్ట్రం మొత్తం 87 రకాల పనులను గ్రామాల్లో చేయడానికి గ్రామసభల ద్వారా ఆమోదిస్తున్నాం. నరేగా కార్యక్రమం ద్వారా అందరికీ పని కల్పించాలి...ఇది ప్రభుత్వ బాధ్యత. 54 లక్షల కుటుంబాలకు నరేగా ద్వారా పని దొరకుతుంది. వానపల్లి బాగుంటే అంబేద్కర్ జిల్లా బాగుంటుంది. అంబేద్కర్ జిల్లా బాగుంటే దేశం బాగుంటుంది. రాష్ట్రంలో 3.54 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటున్నారు. 1.50 కోట్ల మంది పట్టణాల్లో ఉంటున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. 2014 నుండి 2019 మధ్య గ్రామాల్లో అన్ని పనులు చేసి స్వర్ణయుగంగా మార్చాం. 2019 తర్వాత ఒక్క పని కూడా గ్రామాల్లో చేయలేదు. నరేగా బిల్లులు దుర్వినియోగం చేశారు...సొంత జేబుల్లోకి మళ్లించుకున్నారు. నాడు మేం తాగునీటికి ప్రాధాన్యమిచ్చాం. పంచాయతీల్లో సిమెంట్ రోడ్లకు ప్రాధాన్యమిచ్చాం. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఉంటారు. ఎమ్మెల్యే ఎంత ముఖ్యమో గ్రామానికి సర్పంచి కూడా అంతే ముఖ్యం. గత ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు కూడా అపహాస్యం చేసింది. ఎన్నికలు జరగనీయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీయిజం చేశారు. అమరావతిలో ఒక సైకో ఉంటే ఊరికో సైకో తయారై అతలాకుతలం చేశారు. నన్ను కూడా ఐదేళ్లు ఇబ్బందులు పెట్టారు. మన ప్రభుత్వం వచ్చాక మాజీ సీఎం, వైసీపీ నేతలను అడ్డుకున్నామా.? జగన్ లాంటి వ్యక్తులు సమాజానికి చేటు. టీడీపీ చరిత్రలో లేని విధంగా 93 శాతం సీట్లతో గెలిపించి బ్రహ్మరథం పట్టారు. చాలా జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేశాం. దీనికి కారణం గత పాలనలో పడ్డ ఇబ్బందులే.' అని సీఎం పేర్కొన్నారు.

**నెత్తిన రూపాయి పెట్టి వేలం వేస్తే పైసాకు అమ్ముడుపోని వాళ్లు పాలించారు**

'రాష్ట్రానికి గత ఐదేళ్లు శని పట్టింది. ఇప్పుడు కూడా ఒక భూతం ఉంది...దాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే



రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేవాళ్లు వస్తారు. భూతం మళ్లీ అంటోంది వస్తానని. దాన్ని ఏం చేద్దాం.? మంచి భవిష్యత్తు కావాలంటే భూతాన్ని పూర్తిగా భూమిలో పాతేయాలి. మళ్లీ లేయకుండా కాంక్రీట్ వేయాలి. నా మిత్రుడు పవన్ కల్యాణ్, నా కంటే కూడా జగన్ గొప్పవాడా.? నెత్తిన రూపాయి పెట్టి వేలం వేస్తే పైసాకు అమ్ముడుపోడు. అటువంటి వ్యక్తులు ఐదేళ్లు సీఎంగా ఉన్నారు. 2014 నుండి 19 మధ్య 27,444 కి.మీ సీసీ రోడ్లు వేశాం. మన ప్రభుత్వాన్ని కొనసాగించి ఉంటే నూటికి నూరు శాతం అన్ని గ్రామాల్లో రోడ్లు వేసేవాళ్లం.



గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 6643 కి. మీ మాత్రమే సీసీ రోడ్లు వేశారు. స్వచ్ఛ భారత్ లో భాగంగా మహిళల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్లు కట్టించాం.







చెత్త నుండి సంపద తయారు చేయాలని మీ ఊర్లోనే కంపోస్ట్ తయారు చేయాలని 9,838 షెడ్లు నిర్మించాం. రంగుల పిచ్చోడు వాటికి రంగులేసుకున్నారు తప్ప వినియోగించలేదు. 25.22 లక్షల ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశాం...కానీ ఒక దుర్మార్గుడి నిర్లక్ష్యంతో 40 శాతం పని చేయడం లేదు. పంచాయతీ నిధులు ఇవ్వకుండా దారి మళ్లించారు. నేను, పవన్ కల్యాణ్ రాగానే రూ.998 కోట్లు పంచాయతీలకు విడుదల చేశాం...మళ్లీ రూ.1100 కోట్లు విడుదల చేయబోతున్నాం. మొత్తంగా పంచాయతీలకు రూ.2,100 కోట్లు రాబోతున్నాయి. నరేగా డబ్బులు కూడా వస్తున్నాయి...వీటి ద్వారా గ్రామాల్లో మళ్లీ అభివృద్ధిని చూపిస్తాం. పంటకుంటలు 8.97 లక్షలు తవ్వాం...గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కటీ తవ్వలేదు. 3.67 లక్షల ఎకరాల్లో హార్టి కల్చర్ పెంచాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క ఎకరా కూడా హార్టి కల్చర్ పెంచింది లేదు. ఉపాధి హామీ పనికి బోర్డు పెట్టాం..సోషల్ ఆడిట్ చేశాం. కానీ గత ఐదేళ్లు ఏం చేశారో తెలీదు. ఎన్టీఆర్ జలసిరి కింద 32,693 బోర్లు తవ్వి పంపుసెట్లు పెడితే, గత ప్రభుత్వం 2,550 బోర్లు మాత్రమే వేశారు. ఓడీఫ్ రాష్ట్రంగా మార్చాం...వైసీపీ ప్రభుత్వం స్వచ్ఛభారత్ ద్వారా వచ్చిన డబ్బులు కూడా ఖర్చు చేయలేదు. రాబోయే రోజుల్లో 17,500 కిమీ సీసీ రోడ్లు వేస్తాం. రెండుమూడేళ్లలోనే గ్రామాల్లో ప్రతి వీధికి సిమెంట్ రోడ్లు వేస్తాం. మట్టిలో నడిచే పని లేకుండా చేస్తాం. ఇంటికి మట్టి అంటకుండా వెళ్లేలా చేస్తాం. సిమెంట్ డ్రెయిన్స్ కూడా ఏర్పాటు చేస్తాం. 10 వేల కి.మీ సీసీ డ్రెయిన్లు నిర్మిస్తాం. 2,500 కి.మీ బీటీ రోడ్లు వేస్తాం. 4.5 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్, 5 లక్షల పంటకుంటలు, పశువుల, జీవాల కోసం 1.5 లక్షల షెడ్లు నిర్మిస్తాం. 15 కోట్ల నుండి 21.50 కోట్లకు ఉపాధి హామీ పని దినాలు పెంచబోతున్నాం. పెరిగిన ధరల దృష్ట్యా ఉపాధి హామీ కూలీ రేట్లు కూడా పెంచబోతున్నాం.' అని సీఎం స్పష్టం చేశారు.



**ప్రతి ఒక్కరికీ ఇళ్లు...ప్రతి ఇంటికి విద్యుత్, నీళ్లు**

'గ్రామాలకు ఏం కావాలో కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి ఇళ్లు ఉండాలి. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తాం. ప్రతి ఇంటికి కరెంట్ ఉండాలి. ఈ వానపల్లి గ్రామంలో ఇళ్లు లేని 610 కుటుంబాలకు ఇళ్లు కట్టిస్తాం. రాష్ట్రంలో ఎవరూ ఇళ్లు లేదనకుండా ఇళ్లు నిర్మిస్తాం. కరెంట్, కుళాయి ద్వారా నీళ్లు ఇస్తాం. ప్రతి ఇంటిక మరుగుదొడ్డి ఉండాలి. గ్యాస్ కనెక్షన్ ఉండాలి. త్వరలోనే ఇంటింటికీ 3 గ్యాస్ సిలీండర్లు అందిస్తాం. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు ఉండాలి. చెత్త కనబడకుండా స్వచ్ఛ గ్రామాలుగా ఉండాలి. రాష్ట్రంలోని రోడ్లన్నీ బాగు చేస్తాం. గ్రామానికి దగ్గర ఆసుపత్రులు, స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు రోడ్లు చూశారా...ఐదేళ్లలో పైసా కూడా ఖర్చు చేయకుండా గోతులు పెట్టారు. ఈ గోతులు చూస్తుంటే భయంగా ఉంది. రూ.10 లక్షల కోట్ల అప్పులతో పాలన ప్రారంభించాం. జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. పెన్షన్లు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. కానీ ప్రజలకు మంచి చేయాలనే మనసు ఉంది. ఎన్డీయేకు 21 మంది ఎంపీలను ఇచ్చారు. ఎంపీలంతా కేంద్రంలో కీలకంగా ఉన్నారు. మీరు ఇచ్చిన గుర్తింపు అభివృద్ధికి, సంక్షేమానికి ఉపయోగిస్తున్నాం. ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టగానే ఐదు హామీల అమలుపై సంతకాలుపెట్టా. మొదటి సంతకం నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీపై పెట్టాం. నా ఆలోచనంతా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే. రెండో సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. మీ నాన్న, తాత భూములు ఇచ్చారు. ఆ పట్టా పుస్తకాలపై ఎవరి బొమ్మ ఉండాలి...మీది. కానీ వాళ్ల బొమ్మ వేశారు. రాజముద్రతో మళ్లీ పట్టాలు మీకు ఇస్తాం. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చారు...అది వచ్చి ఉండుండే మీ భూములు మీకు దక్కేవి కావు. సాక్షి నుండి గుమస్తాలు తెచ్చి కూర్చోబెట్టేవారు. దుర్మార్గమైన ఆలోచనలు చేశారు. మన జుట్టు పట్టుకుని ఆడించాలని చూస్తే దేవుడు సరైన సమయంలో సరైన చోట కూర్చోబెట్టారు.' అని సీఎం చురకలు అంటించారు.

**హోదా ప్రజలిస్తే వస్తుంది...బెదిరిస్తేనో, దబాయిస్తే రాదు**

'మీరు జగన్ కు హోదా ఇవ్వలేదు..కానీ ప్రతిపక్ష హోదా కావాలంట. ప్రజలు ఇస్తే వచ్చేది









హోదా...ప్రజలు గెలిపిస్తే వచ్చేది పదవి. కానీ దబాయిస్తేనో, నేరం చేస్తేనో, బెదిరిస్తేనో పదవులు రావు. ప్రతి నెలా అధికారులు, ప్రజాప్రతినిధులు పేదల దర్శనం చేసుకోవాలని పేదల సేవలో కార్యక్రమానికి



శ్రీకారం చుట్టాం. రూ.3 వేల పింఛను రూ.4 వేలకు ఎన్డీయే ప్రభుత్వం పెంచింది. పింఛను ఇవ్వాలంటే వాలంటీర్లు మాత్రమే ఇవ్వాలని రాజకీయం చేసి 35 మంది వృద్ధులను చంపారు. కానీ నేడు మనం వాలంటీర్లు లేకుండా ఒకే రోజున 98 శాతం పింఛన్ ప్రభుత్వ యంత్రాంగంతో ఇచ్చాం. అసాధ్యం అని మాయమాటలు చెప్పారు..దాన్ని మనం సుసాధ్యం చేశాం. వికలాంగులకు పింఛను రూ.3 వేల నుండి రూ.6 వేలకు పెంచాం. లేచి తిరగలేని వారికి రూ.15 వేలు పింఛను ఇస్తున్నాం. నేను పడే కష్టం ప్రజల



కోసమే. సంపద సృష్టించి ప్రజలకే ఖర్చు చేస్తాం. మా ఉద్యోగులకు కూడా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నాం. ఒకేసారి 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. వచ్చే



నెల చివరి నాటికి 203 అన్నక్యాంటీన్లు అందుబాటులోకి తెస్తాం. దాతలు ముందుకొచ్చి విరాళాలు ఇస్తున్నారు...వారిని అభినందిస్తున్నా' అని సీఎం తెలిపారు.

**వచ్చే నెల 11 నుండి నూతన ఇసుక పాలసీ**

'నైపుణ్య గణన చేపట్టబోతున్నాం. చదువుకున్న యువత ఉద్యోగాలకు నైపుణ్యం అవసరం. నైపుణ్యం ఉంటే రెట్టింపు ఆదాయం వస్తుంది. నైపుణ్య గణన చేసి నైపుణ్యం పెంచుతాం. ప్రకృతి సేద్యానికి ముందుకు వెళ్లాం. ప్రస్తుతం 12 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతుంది...దాన్ని 50 లక్షల ఎకరాలకు తీసుకెళ్తాం. రైతులకు పెట్టుబడి భారాన్ని తగ్గిస్తాం. మీకు ఇసుక కావాలని బుక్ చేసుకుంటే నేరుగా మీ ఇంటికే వస్తుంది. సీనరేజ్, తవ్వకం, రవాణా ఖర్చులు మీరు పెట్టుకుంటే చాలు...ఇసుకకు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన పనిలేదు. చిన్నపాటి సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తాం. సెప్టెంబర్ 11 నుండి నూతన ఇసుక పాలసీ అమల్లోకి తెస్తాం. సచివాలయంలో రిజిస్టర్ చేసుకుంటే నేరుగా మీ ఇంటికి వస్తుంది. మీరే నేరుగా లారీనో, ట్రాక్టరో తీసుకెళ్తే టోకెన్ ఇస్తారు...ఆ టోకెన్ ఇచ్చి ఇసుక తెచ్చుకోవచ్చు. ఈ యేడాది వర్షాలు బాగా పడ్డాయి. వరుణ దేవుడు కూడా కరుణించాడు. రాబోయే రోజుల్లో కరవు లేకుండా శ్రీకారం చుడుతున్నాం. పోలవరం రాష్ట్రానికి వరం. కానీ ఒక దుర్మార్గుడు నాశనం చేశాడు. దయాఫ్రంవాల్, గైడ్ బండ్, కాఫర్ డ్యాం దెబ్బతిన్నాయి. 2021 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టు మొత్తం పడకేసింది. దయాఫ్రం వాల్ కొత్తది కట్టాల్సి వస్తోంది. లేదంటే ఉభయ గోదావరి జిల్లాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు అదనంగా భారం పడుతోంది...ప్రజల ప్రాణాల కంటే మాకు ఏదీ ముఖ్యంకాదు. రైతులకు గత ప్రభుత్వం పెట్టిన రూ.1674 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించాం. ధాన్యం అమ్మిన రెండు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తాం. బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంగా వ్యవహరిస్తాం. కేంద్రం వివిధ కార్యక్రమాలకు ఇచ్చిన డబ్బులను గత పాలకులు దుర్వినియోగం చేశారు. దీంతో నిధులు కేంద్రం నిలిపేసింది. గత ప్రభుత్వం ఖర్చు పెట్టిన వాటికి వివరాలు లేవు.' అని సీఎం పేర్కొన్నారు.

**వానపల్లి గ్రామంలో ఈ యేడాది చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు**

'వానపల్లి గ్రామంలోనూ కొన్ని సమస్యలు ఉన్నాయి. రూ.10.20 కోట్లతో 16 పనులకు మనం నేడు ఆమోదం తెలుపుకుంటున్నాం. సీసీ రోడ్లు 9.3 కిమీలకు రూ.5.60 కోట్లు, మురుగు కాల్వలు 4.5 కి.మీలకు రూ.2.2 కోట్లు, 3.5 కి.మీ గ్రావెల్ రోడ్లకు రూ.35 లక్షలు, పశువుల కొట్టాలకు రూ.25 లక్షలు, ఉద్యాన పంటలకు రూ.10.50 లక్షలు, ఇలా పలు రకాల పనులను ఈ యేడాది చేయబోతున్నాం. పేదరికం లేకుండా పైకి తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలి. టెక్నాలజీ యుగంలో ఉన్నాం సంపద సృష్టిస్తున్నాం. ఆ సంపద కొందరి చేతుల్లోకే వెళ్తోంది. కనీస అవసరాలు ఇచ్చి, కనీస ఆదాయ మార్గాలు చూపించేందుకు ఆలోచిస్తున్నాం. సంపద ఉన్నవారిలో 20 శాతం మంది పేదరికంలో ఉన్న 20 శాతం మందిని ఆదుకుంటే ఆర్థికంగా పైకి వస్తారు. జనవరి నుండి జన్మభూమి 2.0 కార్యక్రమం తీసుకొస్తాం. ప్రపంచంలో ఎక్కడున్నా గ్రామాల నుండి వెళ్లిన వారు గ్రామాభివృద్ధికి పాటుపడాలి.' అని సీఎం పిలుపునిచ్చారు.

**తలసరి ఆదాయంలో తెలుగువారు చిరునామాగా ఉండాలి**

'ప్రతి ఒక్కరూ అవకాశాలు అందిపుచ్చుకోవాలి. ప్రజలను ఆస్తిగా చూడాలి. కొన్ని దేశాల్లో పిల్లల్ని కనడం మానేశారు. యువత తగ్గిపోతే గ్రామాల్లో వృద్ధులు పెరిగిపోతారు. పుట్టేవాళ్ల సంఖ్య తగ్గి...చనిపోయే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో నేనే జనాభా నియంత్రణ పాటించాలని చెప్పా...ఇప్పుడు జనాభా పెంచండని చెప్తున్నా. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు అన్న నిబంధన రద్దు చేశాం. సోలార్ ద్వారా కరెంట్ ఇంట్లోనే తయారు చేసుకునే రోజు వచ్చింది. ఇంట్లో కరెంట్ ఉత్పత్తి చేసుకుని మిగిలిన కరెంట్ గ్రిడ్ కు అమ్ముకోచ్చు. సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ కూడా వినియోగంలోకి వస్తోంది. 2047 నాటికి దేశం నెంబర్ 1, లేదా 2గా ఉంటుంది. 2029 నాటికి ప్రపంచంలో 3వ స్థానానికి వస్తుంది. మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ 1 గా ఉండాలి. ప్రపంచంలో తెలుగువాడు అగ్రస్థానంలో ఉండాలి. తలసరి ఆదాయంలో తెలుగువారు చిరునామాగా ఉండాలి. ఐదేళ్లలో మీరు ఊహించని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం చేస్తుంది. రాష్ట్రానికి మంచి జరగాలి, మమ్మల్ని నమ్మిన తెలుగుజాతిని నెంబర్ వన్ గా మా ప్రభుత్వం ఉంచుతుంది. రాష్ట్రంలో ప్రజలు చెప్పింది కూడా విని ప్రతి ప్రజాప్రతినిధి, అధికారులు పని చేయాలి..మనం ప్రజల కోసమే ఉన్నాం...ప్రజల కోసమే పని చేయాలి.' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.







## ఊరికి సిరి... ఉపాధి ఊపిరి...

### పాలతోడులో గ్రామసభ

**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించి తద్వారా మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కు ఊపిరి పోయడమే లక్ష్యమని మండపేట మండలం మత్స్య శాఖ అధికారి విళ్ళ రమణారావు పేర్కొన్నారు. మండపేట మండలం పాలతోడు లో గురువారం ఎన్ ఆర్ జి ఎస్ గ్రామ సభ జరిగింది. ఇన్ ఛార్జ్ కార్యదర్శి వర్మ గ్రామ సభ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు.గ్రామాల్లో చేపట్టే పనులు వివరించారు. సర్పంచ్ పిల్లా వేంకట లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్య లో పాల్గొని పనులు ప్రతిపాదించారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు పిల్లా వెంకట్రావు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి హామీతో గ్రామాల్లో మహర్దశ

### ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులతో గ్రామాల దశ మారిపోతుందని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఏడిదలో ఉపాధి హామీ పథకం గ్రామసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు.మండపేట ఎంపీడీవో కె సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సభకు సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అన్ని ముఖ్య మైన పనులు గుర్తించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యం గా సి సి రోడ్ లు డ్రైన్ లు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.గ్రామంలో ప్రతిపాదించిన పనులకు గ్రామ సభలో ఆమోదం చేస్తూ తీర్మానం చేశామని ఎంపీడీఓ వెల్లడించారు. ముఖ్యంగా ఎప్పటినుంచో సమస్యగా ఉన్న దేవుడు కాలనీలోని డ్రైన్ లు అభివృద్ధి చేసేందుకు సుమారు రూ1.48 కోట్లు నిధులతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అలాగే రూ 60 లక్షలతో ఏడిదలు వివిధ చోట్ల సిసి రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదించామన్నారు. ఏడిద లో వివిధ లింకు రోడ్లను నిర్మించేందుకు దాదాపు 20 ప్రతిపాదనలు చేశామన్నారు. గ్రామ సభకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు, మాజీ సర్పంచులు యరపోతిన చంటి, చిలుకూరి శ్రీనివాస్, గ్రామ టిడిపి అధ్యక్షులు పర్వతనేని వీర్రాజు, కొలుపాటి బాబు, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరావు, అధికారులు, పంచాయితీ పాలక వర్గ సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మారేడుబాకలో గ్రామ సభ

### 98 పనులకు ఆమోదం



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వం తో సాధ్యమని జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కొన సత్యనారాయణ తెలిపారు.మండపేట మండలం మారేడుబాక లో శుక్రవారం జరిగిన మహత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అర్ డబ్ల్యూ ఎస్ ఎ ఇ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు.సర్పంచ్ మటపర్తి గోవిందరాజు అధ్యక్షత వహించారు. గ్రామంలో మొత్తం 98 పనులకు సభ లో ఆమోదించారు.రోడ్ లు, డ్రైన్ లు, లింక్ రోడ్ లు ప్రతిపాదనల్లో వున్నాయని గ్రామ కార్యదర్శి కోసనా సాయి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ టెకిదుర్గరావు వార్డు సభ్యులు వాసంశెట్టి గవ్వరాజు, కుక్కల శ్రీనివాస్, అనసూరి శ్రీను, పట్నాల మురళీ టిడిపి నాయకులు యరామటి సుబ్బారావు, రాయుడు గంగా రాజు, మార్ని సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు మురళీ టిడిపి కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, వెలుగు సి సి, పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్తో లాభసాటిగా వ్యవసాయ రంగం

### పొలాలకు దారి సమస్య పరిష్కరిస్తా



**కోరుకొండ, విశ్వంవాయిస్ న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా కుదేలు చేసిందని దీంతో రైతులు తీవ్ర గడ్డు పరిస్థితి ఎదుర్కొంటుందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బూరుగుపూడి గ్రామంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ "గ్రామసభ"కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్వాతంత్ర సమరయోధుడు స్వర్గీయ టంగుటూరి ప్రకాష్ పంతులు జయంతి సందర్భంగా రాజానగరం శాసనసభ్యులు బత్తుల, రాజానగరం తెదేపా ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలలొచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా కార్యాచరణ చేపట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం జగనన్న ఇళ్ల పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుందని, ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికి మూడు సెంట్లు స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి జల్ జీవన్ మిషన్ ద్వారా ఉచిత మంచినీటి కనెక్షన్ తోపాటు సురక్షిత త్రాగునీరు అందించడానికి సుమారు 270 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయనుందన్నారు. నియోజకవర్గంలో సుమారు 12 గ్రామాలు, 9 పంచాయతీలు కార్పొరేషన్ లో విలీనం పేరుతో ఎన్నికలు నిలుపుదల చేశారని, వాటిని పంచాయతీలుగా చేసి త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కార్పొరేషన్ లో విలీనం అయితే అధిక పన్నుల భారంతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ వంటి అభివృద్ధి నిధులు రావని తద్వారా గ్రామ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. డ్వాక్రా మహిళలకు సంబంధించి రాష్ట్రంలో సుమారు 8వేల కోట్ల రూపాయల ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయని, స్త్రీ నిధి పేరుతో బ్యాంక్ ఏర్పాటు చేసి వాటిని మహిళలకు రుణాలుగా ఇస్తే కుటుంబ అభివృద్ధితోపాటు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కు సంబంధించి రైతులకు అనేక పథకాలు ఉన్నాయని రైతులు వాటిని సద్వినియం చేసుకొని ఆర్థికంగా బలోపేతం అవ్వాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపడుతుందన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఉచిత గ్యాస్ పంపిణీకి కార్యాచరణ చేపట్టనుందన్నారు. బూరుగుపూడి మధురపూడి రైతులు ఎదుర్కొంటున్న పొలాలకు దారి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కంటే నాగకేశవరావు, తనకాల నాగేశ్వరరావు, అడపా శ్రీనివాస్, అడ్డాల శ్రీను, లాల్ జవహర్, గంగిశెట్టి చంటిబాబు, ఎంపీడీవో పిఎస్ నరేష్ కుమార్, సెక్రటరీ జాబ్ రాజు, డ్వాక్రా మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో 24,25 తేదీల్లో అన్ని కంపెనీల లేటెస్ట్ మోడల్ కార్లు,బైక్స్ ఒకేచోట

### క్రియేటర్స్ ఈవెంట్ ఆర్గనైజేషన్ వారిచే ఆర్ట్స్ కళాశాలలో ఆటో ఎక్స్‌పో : నగరంలో ఫ్రీడమ్ ర్యాలీ నిర్వహించారు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అన్ని కంపెనీల లేటెస్ట్ మోడళ్ల కార్లు,ద్విచక్ర వాహనాలు ఒకే చోట లభిస్తాయని క్రియేటర్స్ ఈవెంట్ ముఖ్య సభ్యుడు పిఎస్ శివకుమార్ శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ లో ఆటో ఎక్స్పో ప్రారంభిస్తున్న సందర్భంగా ప్రజలలో అవగాహన కోసం కార్లు బైక్ లతో ఫ్రీడం ర్యాలీ నిర్వహించారు.ఈర్యాలీని రోటరీ క్లబ్ ప్రతినిధి తీగెల రాజా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీల్లో రాజమహేంద్ర వరం ఆర్ట్స్ కళాశాల మైదాంలో రెండ్రోజుల పాటు క్రియేటర్స్ ఈవెంట్ ఆధ్వర్యంలో ఆటో ఎక్స్ పో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్లు ఎక్స్ పో పై కార్లు బైక్ లతో ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ నుంచి లాలాచెరువు మీదుగా ఏవి అప్పారావు రోడ్డు జేఎన్ రోడ్డు సోమలమ్మ గుడి టెంపుల్ తాడితోట తదితర ప్రాంతాల మీదుగా కార్ ర్యాలీ జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బైక్ డ్రైవ్ చేసే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు డ్రైవింగ్ చేసేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చు పేర్కొన్నారు. దేశంలో 33 శాతం ప్రమాదాలు సీటు బెల్ట్ ధరించకపోవడం వల్ల, వీటిపై ప్రజలు అవగాహన పెంచుకొని తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈనెల 24,25 తేదీలలో ఆర్ట్స్ కాలేజీలో జరిగే ఆటో ఎక్స్పో షో ను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టూ వీలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్, రోటరీ క్లబ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ రాజమండ్రి ప్రెసిడెంట్ వెంకట్, రోటరీ క్లబ్ ప్రతినిధి తీగెల రాజా,మన్యం ఫణి కుమార్, ఎస్బి మోటార్స్ రామ్ కుమార్,జనరల్ మేనేజర్ ఎం. వి. ఎస్.ఎస్.ఆర్.గుప్తా,రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## అందరి వాడు అంబేద్కరుడు

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ : రాజమండ్రి క్వారీ మార్కెట్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. క్వారీ మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన పార్టీ రాజమండ్రి అధ్యక్షులు వై శ్రీను, బీజేపీ జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను, వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఎన్డిఏ కూటమి పని చేస్తుందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి ద్వారా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ వ్యవస్థని గౌరవిస్తున్నామని తెలియజేశారు. రాజ్యాంగానికి లోబడే పనిచేయాలని అధికారులు అందరికీ తెలియజేశారు. గత జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయలేదన్నారు. నగర ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న ఎన్డీఏ కూటమి తరపున ఎమ్మెల్యేగా తాను బాధ్యత తీసుకుంటానని తెలిపారు. కులమతాలకు అతీతంగా వారి అర్హత మేరకు సంక్షేమ పథకాలు అధికారులకు అందించడం జరుగుతుందన్నారు. ఇంతకాలం అన్న క్యాంటీన్ మూసి వేయటం వల్ల జరిగిన ఇబ్బందులను తెలుసుకొని పునః ప్రారంభించుకున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చడం జరుగుతుందన్నారు. అంబేద్కర్ లాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవటం మనందరి బాధ్యత అని తెలియజేశారు. క్వారీ సెంటర్లో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ నాల్గవ సెమిస్టరులో మోడరన్ విద్యార్థుల జయభేరి



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నాల్గవ సెమిస్టరు డిగ్రీ ఫలితాల్లో మోడరన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ పాయింట్స్ సాధించి జయభేరి మ్రోగించారు.ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు మాట్లాడుతూ బీఎస్సీ విభాగంలో 20 మంది విద్యార్థులు 9.0 నుండి 9.5 మధ్య జిపిఎ పాయింట్స్ సాధించి మరోసారి పట్టణంలో అగ్రగ్రామిగా నిలవడం ఆనందదాయకం అన్నారు. డిగ్రీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ సంస్థ రూపొందించుకున్న పటిష్ట అకాడమిక్ ప్లాన్,విద్యార్థులకు అవగాహనతో కూడిన బోధన వల్ల ఈ విజయం దక్కిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ జిపిఎ పాయింట్స్ సాధించిన ఎన్. అనురాధ, పి.అనూష, సి.హెచ్.అంజలి దేవి, ఎస్.జయచంద్రిక, ఎం.శృతి, ఎస్.దేవి చంద్రిక, వి.సౌజన్య తదితరులను అధినేత జి.వి.రావు, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు,అకడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి,మోడరన్ డిగ్రీ కాలేజీ సిబ్బంది అభినందించారు.

## 21 పంచాయతీల్లో గ్రామ సభలు పూర్తి

### ఎంపిడిఓ కృష్ణ మోహన్



**అల్లవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజు అల్లవరం మండలం లోని 21 గ్రామ పంచా యతీలలో ఆ యా గ్రామ సర్పంచుల అధ్యక్షతన ఉపాధి హామీ పథకం పనులు, స్వర్ణ గ్రామం లక్ష్యాలు సాకారం ప్రధాన అంశాలుగా నిర్వహించిన గ్రామ సభలు విజయ వంతంగా ముగిశాయి. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, పంచాయతీ సభ్యులు, ఉపాధి హామీ వేతన దారులు, కూటమి నాయకులు, సచి వాలయం సిబ్బంది పాల్గొన్నారు.ముఖ్యంగా ఉపాధి హామీ పథకం లో కుటుంబానికి 100 రోజుల ఉపాధి, స్త్రీ , పురుషులకు సమాన వేతనం, సామాజిక తనిఖీ ప్రాముఖ్యత , 2024 - 25 సంవత్సరానికి సుమారు 4 కోట్ల 27 లక్షల అంచనాలతో సిసి రోడ్లు డ్రెయిన్లు పనులు ప్రతిపాదనలు సభల్లో ఉంచారు. స్వర్ణ గ్రామం లక్ష్యం అనగా ప్రతి ఇంటికి విద్యుత్, గ్యాస్, త్రాగునీరు, మరుగు దొడ్డి ఉండేలా ప్రణాళికల తయారు చేయాలని స్థానిక ఉద్యోగులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

## ఘనంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



**అల్లవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**
ఆంధ్ర కేసరి ప్రకాశం టంగుటూరి పంతులు జయంతి ను అల్లవరం ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి , రెవిన్యూ శాఖలో ఫి ర్కా వ్యవస్థ ద్వారా సంస్కరణలు కు ఆధ్యుడు అని వారి సేవలు కొని యాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వీరోచిత పోరాటం వలన ఆంధ్ర కేసరి బిరుదు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, ఏ ఓ లక్ష్మణ రావు, సిబ్బంది రమణ, సుబ్బలక్ష్మి, ప్రశాంత్, అనిల్, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణ కల్పించాలి

### జమాఅతె ఇస్లామీ హింద్ డిమాండ్




**మండపేటటౌన్ విశ్వంవాయిస్ న్యూస్ :** మహిళలపై రోజూ వేయికి పైగా అత్యాచారాలు జరుగుతుండగా 86 కేసులు నమో దౌతున్నాయని జమాత్ మహిళా రక్షణ ర్యాలీలో వక్తలు అభిప్రాయపడ్డారు. మండపేట జమాఅతె అధ్యక్షులు అబుల్ అలా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరసన ర్యాలీలో జమాత్ మహిళా రాష్ట్ర నాయకులు ఆయిషా పాల్గొని ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా మహిళాల పై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మహిళలకు రక్షణ లభించాలంటే మద్యపానం,మాదక ద్రవ్యాలను నిషేధించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం మద్యనిషేధం,మాదక ద్రవ్యాలు నిషేధించే వరకు కో ఎడ్యుకేషన్విధానానికి స్వస్తిపలకాలని ఆమె అన్నారు.మహిళా ఉద్యోగులకు నైట్ షిఫ్ట్ ఉండకూడదని ఈదిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అన్నారు. ఇంజినీరింగ్ ,మెడిసిన్ లలో ఇంటర్నల్ మార్కుల కారణంగా అమ్మాయిలను వేధించే ఘటనలు జరుగుతున్నందున విద్యార్థినులలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఇంటర్నల్ 1మార్కుల విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 27 వ వార్డు కౌన్సిలర్ నీలం దుర్గ, సి పి ఐ ఎం జిల్లా నాయకురాలు కే కృష్ణవేణి,స్థానిక మహిళా అధ్యక్షురాలు ఆబిదా సుల్తానా, ఆయిషా తదితరులు పాల్గొన్నారు.

# వాడి వేడిగా జరిగిన గ్రామ సభ

## పలు సమస్యలతో ప్రశ్నలు కురిపించిన టీడీపీ నాయకులు



**అల్లవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ మల్లాడి మంగయ్యమ్మ ఉమామహేశ్వరరావు ఆధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభ కు ప్రత్యేక అధికారిగా ఎస్ వి ఎస్ ప్రసాద్ హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ భర్త ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలని స్వర్ణ గ్రామాలుగా తీర్చి దిద్దాలని సంకల్పం తో ఉన్నదని దానిలో భాగంగా ఈ రోజు మన పంచాయతీ లో గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియచేసారు. గ్రామం మొత్తం 524 జాబ్ కార్డు లు ఉన్నాయని, అందులో 348 ఆక్టివేషన్ లో ఉన్నాయని మొత్తం గా 238 రోజులు పని చేసారని తెలిపారు. ప్రతీ ఒక్కరూ జాబ్ కార్డు ని ఉపయోగించుకుని ఉపాధి పొందాలని కోరారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కొల్లు విష్ణు మూర్తి మాట్లాడుతూ గత 5 సంవత్సరాలు లో ఒక్క గ్రామ సభ నిర్వహించలేదని, ఇప్పుటి నుండి గ్రామ సభ లు నిర్వహించి ప్రతిదీ ప్రజలకు తెలిసేలా చేస్తామని తెలిపారు. దానికి స్పందించిన సర్పంచ్ భర్త ఉమా ప్రతీ సంవత్సరం గ్రామ సభ లు పెట్టామని పిలిచినా మీరు రాలేదని, స్టేజి పై కి ఆహ్వాన్నించే వారు అని పెట్టినపుడు మీరు రాకుండా ఇప్పుడు వచ్చి అడగడం కరెక్ట్ కాదని తెలిపారు.గతంలో లో నేను సర్పంచ్ గా అధికారం లోకి వ చ్చినప్పటికి 5 లక్షలు నిధులు ఉండేవని, మరలా పదవీ నుండి దిగేటప్పటికి 50 లక్షలు నిధులు ఉన్నాయని ఏమి ఐయ్యాయో తెలియదని సభ లో తెలిపారు. సర్పంచ్ మంగయ్యమ్మ ని వివరణ కోరగా 2 సంవత్సరాలు వరకు ఎలక్షన్ జరగలేదని, ఎలక్షన్ ఐయ్యాక 3 నెలలకి చెక్ పవర్ వచ్చిందని, విష్ణు మూర్తి 50 లక్షలు ఉన్నాయని చెప్పడం చాలా విడ్డురం గా ఉందని 50 లక్షలు ఉన్నాయని ఆధారళాతో చూపిస్తే అవి ఏమి ఐయ్యాయో తెలియడానికి అవకాశం ఉంటుందని వివరణ ఇచ్చారు. సర్పంచ్ భర్త మాట్లాడుతూ నోటికి ఏది వస్తే అది మాట్లాడటం నాయకుల కు తగదని తెలుసుకుని ఆధారళాతో మాట్లాడాలని కోరారు.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామం లో చాలా సమస్యలు ఉన్నాయని అవన్నీ తీర్చాలని, సెక్రటరీ పూర్తి బాధ్యత తీసుకుని గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. తాడి కమలనాభం మాట్లాడుతూ బ్రాంది షాప్ ఎదురుగ చికెన్ షాప్, అలాగే విష్ణు మూర్తి భవనం చెడు డ్రైనేజ్ వల్ల రోడ్డు పై ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని సమస్య ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. గ్రామం లో పలు సీసీ రోడ్లు, ప్రహరీ గోడలు,పలు రైతులవి కొబ్బరిచెట్లు తవ్వడం, పలు పనులకు సుమారు 29 లక్షలు రూపాయలు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాధనలో ఉన్నాయని ఇంకా ఎవరైనా రైతులు ఉంటే మాకు లేదా సర్పంచ్ కి తెలియపర్చాలని ఫీల్డ్ అసిస్టెంట్ మధుర శ్రీను తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి మంగయ్యమ్మ ఉమామహేశ్వరరావు, విష్ణు మూర్తి, లెనిన్, పి రామకృష్ణ,ఎస్ రమణ, రామకుమార్,ఈశ్వరరావు,టి కమలనాభం,కె సత్యనారాయణ, పలువురు టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎంఎస్ఎంఈలకు దారిచూపుతున్న

# జస్ట్ డయాల్ Justdial™

**తూర్పుగోదావరి, విశ్వం వాయిస్ న్యూస్ :**
తూర్పుగోదావరి జిల్లా యొక్క గొప్ప ఆగ్రోబేస్, విస్తారమైన తీరప్రాంతం అభివృద్ధిచెందుతున్న కళలు చేతిపనుల పరిశ్రమ అనేక ఎంఎస్ఎంఈల అభివృద్ధిని సులభతరంచేశాయనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 60,000 ఉద్యం-నమోదిత ఎంఎస్ఎంఈలతో, తూర్పు గోదావరి ఆంధ్రప్రదేశ్ యొక్క వ్యవస్థాపక స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు.ఈ శక్తివంతమైన ఆర్థిక దృశ్యం మధ్య,జస్ట్‌డయల్ ఎంఎస్ఎంఈలకు కీలకమైన భాగస్వామిగాఉద్భవించిందన్నారు. కొత్త శిఖరాలను చేరుకోవడానికి వారికిశక్తినిస్తుందన్నారు. సమగ్ర డిజిటల్ మార్కెటింగ్ పరిష్కారాల ను అందించడం ద్వారా,తూర్పు గోదావరిలోని స్థానిక వ్యాపారాలు వారి దృశ్యమానతను మెరుగు పరచడానికి,సంభావ్య కస్టమర్లతో కనెక్ట్ అవ్వడానికి స్థిరమైన వృద్ధిని సాధించడానికి జస్ట్ డయల్ సహాయం చేస్తోందన్నారు. హార్వెస్ట్ మూన్ మల్టీ ఎనర్జీ ఇంజినీరింగ్ టెక్నాలజీస్ యజమాని సురేష్, తన అనుభవాన్ని పంచుకుంటూ,"వాణిజ్య శీతలీకరణ ఉత్పత్తులతో కూడిన నా వ్యాపారం 2014లో ప్రారంభించబడిందన్నారు. తొలుత నేను చాలా కష్టపడ్డాను, కానీ 2016లో జస్ట్‌డయల్‌తో భాగస్వామ్యం చేసుకున్నప్పటి నుండి నా వ్యాపారం ఏడాదికి 20 నుంచి 30 శాతం వృద్ధి నమోదు చేసిందన్నారు. జస్ట్‌డయల్ ఊహించని ఫలితాలను అందిస్తోంది. మరియు నా వ్యాపారం రోజురోజుకు అభివృద్ధి చెందుతోందన్నారు. గోదావరి ఆటో పవర్ సిస్టమ్స్ యజమాని సిహెచ్ వెంకట రమణ కోసం, జస్ట్ డయల్ గేమ్ ఛేంజర్‌గా మారిందన్నారు.కాకినాడలోని రాయల్ డయాగ్నోస్టిక్సెంటర్ యజమాని మహ్మద్ రజా అజరుల్లా అనుభవంలో కూడా జస్ట్‌డయల్ యొక్క వ్యాపారవృద్ధిని నడిపించే సామర్థ్యం స్పష్టంగా కనిపిస్తుంది. అతను మాట్లాడుతూ "మేము 2018లో జస్ట్‌డయల్ తో భాగస్వామ్యం చేసుకున్నాము. కేవలం ఒక సంవత్సరం తర్వాత, మేము టాప్ ఫైవ్ ప్యాకేజీలలో ఒకదానికి అప్‌గ్రేడ్చేసాము. అధిక పోటీ ఉన్నప్పటికీ,మా లీడ్‌లు పెరిగాయి.మా వ్యాపారం 20% నుండి 30% వరకు పెరిగింది. జస్ట్‌డయల్ ఎల్లప్పుడూ సహాయకారి గా ఉంటుంది. వారి మద్దతుకు నేను కృతజ్ఞుడను"అని అన్నారు.తమ అగ్రశ్రేణిప్యాకేజీలతో, జస్ట్‌డయల్ వ్యాపారాలు తమ మార్కెట్‌ఉనికిని పెంచుకోవడానికి వీలు కల్పిస్తుంది, పోటీ రంగాలలో కూడా వారు ప్రత్యేకంగా నిలిచేలా మరియు స్థిరమైన క్లయింట్‌లను ఆకర్షిస్తుంది.

### కమిటీ కుర్రోళ్ళు చిత్రాన్ని ఆదరిస్తున్న


# ప్రేక్షకులకు ధన్యవాదాలు

## -చిత్ర సమర్పకులు,నటి కొణిదల నిహారిక, చిత్ర దర్శకుడు యదువంశీ



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మూడవ వారంలో కూడా "కమిటీ కుర్రోళ్ళు "మూవీని ఆదరిస్తున్న రాజమహేంద్రవరం ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చిత్ర సమర్పకులు,నటి నిహారిక,చిత్ర దర్శకుడు యదువంశీ, చిత్ర నటీనటులు పేర్కొన్నారు.గోదావరి బ్యాక్ డ్రాప్ తో అమలాపురం పరిసర ప్రాంతాల్లో తెరకెక్కించిన ఈ మూవీకి రాజమండ్రిలో మంచి ఆదరణ లభించడం ఆనందంగా ఉందన్నారు. నిహారిక కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్ పై కొణిదల పద్మజ నిర్మించిన ఈ మూవీకి మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా ఉన్నారు.శ్రీ లాస్య ఫిలిమ్స్ జిల్లాలో పంపిణీదారుగా ఉంది.ఈనెల 2వ తేదీన చిత్ర ప్రమోషన్ లో భాగంగా రాజమండ్రి విచ్చేసిన యూనిట్ ఇప్పుడు చిత్ర విజయోత్సవ యాత్రలో భాగంగా అనుశ్రీ థియేటర్ కి విచ్చేసి సందడి చేసింది. సినిమా మధ్యలో ఎంట్రీ ఇచ్చిన చిత్రబృందం ఆడియన్స్ తో మాటలు కల్పింది. " సినిమా ఎలా ఉంది,ఎన్ని సారి చూస్తున్నారు .. ఎవరి యాక్షన్ బాగుంది .. 'అంటూ చిత్ర యూనిట్ ప్రశ్నలు వేస్తూ ఆడియన్స్ నుంచి సమాధానాలు రాబట్టింది. చిత్రంలోని డైలాగులను కూడా ఆడియన్స్ చెబుతుంటే ,అందుకు తగ్గట్టు నటులు కూడా తమ హావభావాలను ప్రదర్శించారు.సందీప్ సరోజ్, యస్వంత్ పెండ్యాల,త్రినాధ్ వర్మ, ఈశ్వర్ రాచిరాజు,ప్రసాద్ బెహరా, శ్యాం కళ్యాణ్, పరిమి లోకేష్ కుమార్, రఘువరన్, అక్షయ శ్రీనివాస్, సువకుమార్ మట్టా,తేజస్వి రావు,తదితరులు పాల్గొన్నారు. నిహారిక మాట్లాడుతూ ఈ చిత్రాన్ని కోనసీమలో తీసినందున అక్కడే ఎక్కువగా ఆదరిస్తారని ముందే ఊహించామని అయితే రాజమండ్రిలో కూడా ఆదరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు కావడంతో అభిమానుల హర్షద్వానాలు చేయడంతో 'హ్యాపీ బర్త్ డే మెగాస్టార్ 'అంటూ అందరితో కల్పి నిహారిక తదితరులు విషెస్ చెప్పారు. చిత్రాన్ని పంపిణీ చేసిన శ్రీ లాస్య ఫిలిమ్స్ వారికీ కూడా ధన్యవాదాలు తెలిపారు. తొలుత డప్పు వాయిద్యాల నడుమ వర్షం లో సైతం చిత్ర బృందం థియేటర్ లోకి అడుగుపెట్టింది. కాగా ఈ సినిమా ఈనెల 9న వరల్డ్ వైడ్ థియేటర్లలో సందడి చేస్తోంది.

# రూ 1,490 కోట్లతో రాష్ట్ర పంచాయతీల బలోపేతం




వైకాపా ఐదేళ్ళ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

అయోమయం పాలైన పంచాయతీ సర్పంచులు

15 ఆర్థిక సంఘం, జలజీవన్ నిధులు గోల్ మాల్

పంచాయతీలను బలోపేతం చేస్తోన్న ఎన్.డి.ఎ. సర్కార్



**శంఖవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**
2019 - 2024 ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యపు పాలనలో పంచాయతీలకు విడుదలైన 15 వ ఆర్థిక సంఘం, జలజీవన్ మిషన్ నిధులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తన సందేహాన్ని వ్యక్తం చేశారు. ఆర్థిక సంఘం నిధులు లేని ఒక్క పంచాయతీలే కాదు నిధుల లేమితో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కూడా నిర్వీర్యమై పోయాయని ఆమె ఆరోపించారు. ఎందుకు ఎన్నిక అయ్యామని ప్రజా ప్రతినిధులు కూడా అయోమయం పాలయ్యారని ఆమె పేర్కొన్నారు. ఇంతటి నిర్వీర్యం పాలైన స్థానిక సంస్థలైన పంచాయతీలను మొట్ట మొదటగా బలోపేతం చేసేందుకు, గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపించ డానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి రూ. 1,490 కోట్లను నేరుగా పంచాయతీ ఖాతాలకు బదిలీ చేశారని ఎమ్మెల్యే సత్యప్రభ వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మన పంచాయతీ - మన సాధికారత పేరుతో ఊరు బాగు కోసం అందరూ పాల్గొనండని పిలుపునిస్తూ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని వేళంగిలో సర్పంచ్ మేకల సుబ్బయ్యమ్మ, పెదమల్లాపురంలో సర్పంచ్ గుండు నాగదేవి, గౌరంపేటలో సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు, అచ్చంపేటలో సర్పంచ్ బొట్టా చైతన్య, గొంధి కొత్తపల్లిలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, ఎస్.జగ్గంపేటలో సర్పంచ్ బైరా ఉప్పారావు, శంఖవరంలో సర్పంచ్ బందిలి గన్నియమ్మ, నెల్లిపూడిలో సర్పంచ్ నరాల శ్రీలత, కొంతంగిలో సర్పంచ్ దూడల రామస్వామి, వజ్రకూటంలో సర్పంచ్ సకురు గుర్రాజు, కత్తిపూడిలో సర్పంచ్ కొల్లు సత్యనారాయణ, సీతయమ్మపేటలో సర్పంచ్ తోట నాగజ్యోతి, అన్నవరంలో సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, మండపంలో సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం అధ్యక్షతన శుక్రవారం ఉదయం గ్రామ సభలను నిర్వహించారు. వీటిలో కత్తిపూడి గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరై సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ లోఎన్.డి.ఎ. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మన నియోజకవర్గంలో కాంక్రీటు సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ. 15 కోట్లను మంజూరు చేయించాననీ, ఇందులో నుంచి కత్తిపూడి పంచాయతీకి రూ. 25 లక్షలను మంజూరు చేస్తున్నానని ఎమ్మెల్యే వెల్లడించారు. వ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించు కుంటున్నాం. అందులో భాగంగానే మన ప్రత్తిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామ సభలను చేపడుతున్నాం. రాజకీయాలకు అతీతంగా గ్రామ పెద్దలు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఇందుకు స్పందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ గౌతు సుబ్రహ్మణ్యం (నాగు) గ్రామాభివృద్ధికి పార్టీలతో నిమిత్తం లేకుండా తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే ప్రతిస్పందిస్తూ గ్రామ అభివృద్ధికి కలిసి వచ్చే అన్ని నాయకత్వాలను కలుపుకునే ముందుకు కొనసాగుతామని ఎమ్మెల్యేగా ప్రజోపయోగకరమైన తన సమ్మతిని సత్యప్రభ తెలిపారు. ఇక్కడి ప్రజలు, నాయకులు కోరుతున్నట్టు కత్తిపూడిలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తానని, నేను ఏ ఆశయంతోనైతే రాజకీయాల్లోకి వచ్చానో ఆ ఆశయాన్ని మీ అందరి సహకారంతో నెరవేరుస్తానని సభికుల హర్షద్వానాల మధ్య ఎమ్మెల్యే సత్యప్రభ ప్రకటించారు. శంఖవరం గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత పర్వత సురేష్ మాట్లాడుతూ... మన గ్రామ అభివృద్ధికి మనమే పాటు పడాలని సూచించారు. గ్రామ సుందరీకరణను చేయాలని, ప్రభుత్వ, పంచాయతీ, చెరువుల భూముల్లోని ఆక్రమణలను అవసరమైతే పోలీసుశాఖ సహకారంతోనైనా ఖాళీ చేయించాలని, కొన్ని ప్రభుత్వ భవనాల ప్రాంగణాలకు రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని గ్రామ పౌరునిగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు ఇంకి పోకుండా ప్రతీ ఇంటి ప్రాంగణంలోనూ ఇంకుడు గుంతలను నిర్మించి భూగర్భ జలాలను సంరక్షించు కోవాలని సూచించారు. ఆర్థిక వనరులను మెరుగు పరచుకోవాలని, గ్రామంలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలు వైయుక్తికంగా, సంస్థ, సంఘం పరంగా అభివృద్ధి చెందాలని, డెంగీ, మలేరియా తదితర వ్యాధులు రాకుండా గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పాలని, పిల్లలు, యువత ఉన్నత విద్యావంతులై ఉన్నత ఉద్యోగాలను చేపట్టి అన్ని రకాలుగా గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని కోరుతూ, ఈ లక్ష్య సాధనకు తన వంతు కృషి చేయడానికి, సలహా సహాయం అందించడానికి తాను దృఢ నిశ్చయంతో గ్రామాన్ని ముందుకు నడిపించడానికి తన వంతు కృషి చేస్తున్నానని పర్వత సురేష్ బాధ్యత గల పౌరునిగా తన మనోభీష్టాన్ని సభికుల ముందు ఉంచారు. శంఖవరం జనసేన పార్టీ సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ తన సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి ప్రత్యేక అధికార్లు శంఖవరం ఎంపీడీవో. గెరగా శివరామకృష్ణయ్య, ఈవోపీఆర్డీ. జయంతి వెంకట శివరామకృష్ణ, ఎమ్ఈఓలు. సూరిశెట్టి వెంకట రమణ, టి.గోవిందు, పీఆర్.ఏఈ. ఎన్.మురళి, ఆర్.డబ్ల్యూఎస్. ఏఈ. ఎమ్.డి.తేజ్, ఉద్యానవన అధికారి అరుణకుమార్, మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంటు ఎస్.నగేశ్ బాబు, ఐసిడిఎస్. ఈవో. బి.వెంకటరజని, ఇంకా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

### జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్)గా

## అల్లూరి వెంకట సుబ్బరాజు బాధ్యతలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గురువారం ఉదయం జిల్లాకు అడిషనల్ ఎస్పీ (లా అండ్ ర్డర్)గా అల్లూరి వెంకట సుబ్బరాజు బాధ్యతలు స్వీక రించారు. ఈయన 1989 బ్యాచ్‌కు చెందిన వెంకట సుబ్బరాజు గతంలో ఎస్.ఈ.బి చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహిస్తూ,ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) గా నియమితులయ్యారు.

### పంట కాలవలో

# మృత దేహం లభ్యం



**అల్లవరం విశ్వంవాయిస్ న్యూస్ :**
అల్లవరం మండలం కొమరగిరిపట్నం చివర నక్కా రామేశ్వరం గ్రామానికి చెందిన చెక్కా వెర్రియ్య ఒక ఫంక్షన్ నిమిత్తం బుధవారం మోటర్ సైకిల్ పై వెళ్లి భార్య ను బామ్మర్ది ఇంటి దగ్గర దింపి తిరిగి స్వగ్రామం వస్తుండగా మెయిన్ రోడ్డు గోడిలంక పంట కాలవలో పడి మృతి చెందాడు. అయితే ఇతని ఆచూకీ తెలియలేదు. శుక్రవారం సేవ మై తేలాడు దురవాసన రావడం తో రోడ్డు పై ప్రయాణించే ప్రజలు గుర్తింఛి పోలీస్ లకు సమాచారం అందించారు. ఏ ఎస్ ఐ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పంట కాలవ నుండి తీసి ఈయన ఆచూకీ ఎంక్వయిరీ చేస్తే ఒక పెట్రోల్ బంక్ లో పని చేస్తున్నాడని, నక్కా రామేశ్వరం గ్రామస్తుడిగా గుర్తించారు.పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్ కి మృత దేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీస్ లు చెప్పారు.ఇతను మృతి చెందడం తో నక్కా రామేశ్వరం లో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. ప్రభుత్వ పరం గా వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# పరిశోధనలతోనే నైపుణ్య ప్రగతి

## డిగ్రీ కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు




**మండపేట టౌన్ న్యూస్ :** అనునిత్యం కొత్త పరిశోధనల ద్వారానే నైపుణ్యం పెరుగుతుందని దక్షిణ కొరియా ప్రొఫెసర్ కె.నవీన్ కూమార్ పేర్కొన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో శు క్రవారం జరిగిన స్మార్ట్ మెటీరి యల్స్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్ అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్ రెండవ రోజు నిర్వహించారు. ఈ సదస్సు కు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.దక్షిణ కొరియా నుంచి వచ్చిన ప్రొఫెసర్ కె.నవీన్ కూమార్ మాట్లాడుతూ లిధియం బ్యాటరీ మీద తాను చేసిన పరిశోధనలను వివరించారు. డాక్టర్ ఎ.బార్గవ్ మాట్లాడుతూ తన పరిశోధనలైన ఫ్లోరానిసిక్ పౌడర్ యల్.ఇ.డిలు అంశాలను వివరించారు. అర్ ఏం టి యూనివర్సిటీ నాగపూర్ ప్రొఫెసర్ సంజీవ్ డోగేల్ మాట్లాడుతూ నానో మెటీరియల్స్ నానో యింజన్స్ అనే అంశం పై ఉపన్యాసం చేశారు. సదస్సు ముగింపు కార్యక్రమంకు ముఖ్య అతిధితులు గా రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అర్.కె., నన్నయ్య యూనివర్సిటీ చెందిన రాజ్యలక్ష్మి లు పాల్గొన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సెమినార్‌ను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సెమినార్‌లో చర్చించిన అనేక పరిశోధన భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు పేర్కొన్నారు.

### రఘుదేవపురం గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న

# శాసనసభ్యులు బత్తుల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం, రఘుదేవ పురం గ్రామంలో జరిగిన గ్రామ సభలో స్థానిక శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ రాజానగరం నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. ఈ సభను ఉద్దేశించి స్థానిక శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో(ఎన్ ఆర్ జి ఎస్) కొత్తగా ప్రవేశపెట్టిన కార్యక్రమాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని, సంబంధిత విషయాలు క్లుప్తంగా ప్రతి ఒక్కరు అవగాహన చేసుకుని ఈ గ్రామ సభ ద్వారా కొత్త పనులను, కొంత రోడ్లు సిసి రోడ్లు డ్రైన్లు చెరువులు అధినికరణ కాలవల మరమ్మత్తులు పంట కాలువల మరమ్మత్తులు మంచినీటి సమస్యలపై అప్లై చేసుకోవచ్చు అని చెప్పారు. అలానే రాష్ట్ర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పులు రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నిర్వీర్యం అయిపోయిందని, దాన్ని సరి చేసే బాధ్యత పాలకులు, అధికారులతో పాటు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ మన పరిపాలన మన గ్రామ స్వరాజ్యం దిశగా ప్రజలందరూ భాగస్వామ్యం అవుతూ, ఈ విధంగా ముందుకు వెళితే ప్రతి పంచాయతీ అభివృద్ధి పథంలో కచ్చితంగా ముందుకు వెళుతుందని ఈ సభలో ఆశాభావం వ్యక్తం చేస్తూ, రైతులు ఎవరైనా ఈ ఉపాధి హామీ ద్వారా పనులు చేయించుకోవాలంటే, ఈ గ్రామ సభ ద్వారా అప్లై చేసుకోవచ్చని ఇలానే రాష్ట్రం అంతా గ్రామసభలు ఇదే రోజు జరగడం చాలా సంతోషం అని, కచ్చితంగా రాబోయే రోజుల్లో మంచి ఫలితాలు ఉంటాయని సంతోషాన్న ఈ సందర్భంగా వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన, టిడిపి, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రఘుదేవపురం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో విద్యార్థులకు

# నూతన వస్త్రాలు పంపిణీ

**చిరుసేవాసమితి అధ్యక్షుడు గెడ్డం శివరత్న గణపతి ఆధ్వర్యంలో పలుసేవలు**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక కోరుకొండ రోడ్డులో గల ప్రియదర్శిని చెవిటి మూగ ఆశ్రమ పాఠశాల నందు చిరు సేవాసమితి అధ్యక్షుడు గేడ్డం శివరత్నం గణపతి ఆద్యంలో పదవిభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాజమహేంద్ర వరం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు వై. శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులతో కలిసి కేక్ కటింగ్ చేసి అనంతరం విద్యార్థులకు బట్టలు పంపిణీ కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివ మిత్ర బృందంతో పాటు రాజమహేంద్రవరం జనసేన నాయకులు షేక్ భాషా లిమ్రా, అక్కిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రియదర్శినీ బాలవిహార్‌లో భారతదేశ తొలి


# జాతీయ అంతరిక్ష దినోత్సవం




కొత్తపేట ఆగస్ట్ 23. విశ్వం వాయిస్ న్యూస్. ప్రియదర్శినీ బాలవిహార్ లో భారతదేశ తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానాన్ని కలిగించే రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలతోనూ, శాస్త్రవేత్తల చిత్రపటాలతోనూ పిల్లలు స్పేస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసారు. అనేక చిత్రాలను గీసి ప్రదర్శించారు. అనేక మంది చిన్నారులు చంద్రయాన్-3 విజయాలను గురించి, అంతరిక్షం గురించి అనేక విషయాలను ప్రసంగించారు. కరస్పాండెంట్ బుద్ధచంద్రదేవ్ సైన్స్, టెక్నాలజి, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ యస్ టీ ఈ ఎం ప్రాముఖ్యతను వివరించారు. అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య చంద్రుని దక్షిణ ధృవం పై మొదటిసారి విక్రమ్ ల్యాండర్ ను దింపిన దేశం మనదేనీ, అందుకు మనం గర్వించాలనీ చెప్పారు. చంద్రుని పై పగటి కాలం 15 రోజులు అని విక్రమ్ లాండర్ పగటికాలమంతా పని చేసి సెప్టెంబర్ 3 న ఆగిందని తిరిగి రాత్రి కాలం (-120డి) పూర్తయ్యాక స్పందించలేదని వివరించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎఎస్సార్ మూర్తి పిల్లలు తమతో బాటు తమ తల్లిదండ్రులకు కూడా శాస్త్రీయ విజ్ఞానం తెలిసేలా ఉన్నతంగా చదువుకోవాలన్నారు. అనంతరం పిల్లలు డిజి క్లాసులో అంతర్జాలంలో అంతరిక్ష విజ్ఞానంపై పలు ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్నారు.

## గ్రామ సభలో పాల్గొన్న

# మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** ద్రాక్షారంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆంధ్రప్రదేశ్ గ్రామ సభకు మంత్రి సుభాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామసభ ద్వారా పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించుకొని, ఉపాధి హామీ పథకం వ్యవసాయ అనుబంధ పనులు నీటి సంరక్షణ పనులు మౌలిక సదుపా యాలు కల్పన మొదలైనవి గ్రామసభ ద్వారా పరిష్కరించు కోవచ్చని, అదేవిధంగా అభివృద్ధి సంక్షేమం ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారధ్యంలో స్వర్ణాంధ్రప్రదేశ్ రూపుదిద్దుకుంటుందని, పవన్ కళ్యాణ్, లోకేష్ ఆలోచనలతో ఎన్డీఏ కూటమి ద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. ఈ సమావేశానికి ద్రాక్షారం సర్పంచ్ అరుణ నియోజకవర్గ ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది మొదలైన వారు పాల్గొన్నారు.



## రామచంద్రపురం వీఎస్ఎం కాలేజీలో

# ఉచిత డిఎస్సీ కోచింగ్



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలో స్థానిక వివిఎస్ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత టెట్ మరియు డిఎస్సీ కోచింగ్ సెంటర్ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ ప్రారంభించారు. ముఖ్యధితిగా జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్ట్ కూడా వేయలేదన్న మంత్రి శుభాష్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డిఎస్సీపై తొలి సంతకం చేసి టీచర్స్ పట్ల తనకున్న కమిట్మెంట్ నిరూపించుకున్నా రని తెలియజేసారు. అన్ని వృత్తులకంటే ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని అందుకే ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభిచామని అన్నారు. ఇక్కడ నిపుణులైన అధ్యాపకులచే శిక్షణ పొంది ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. అలానే కొంతమంది దాతలు సహకారంతో సమకూర్చిన స్టడీ మెటీరియల్ ను విద్యార్థులకు పంపిణీ చెయ్యడం జరిగింది. కోనసీమ రైస్ మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయలు విరాళంగా ఇవ్వగా రామచంద్రపురం పట్టణంలో కేవీర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కోట సతీష్ కుమార్ మంత్రి సుభాష్ చేసిన సేవలకుగానూ తన వంతు సహాయంగా 50 వేల రూపాయలు టెట్ డిఎస్సి కోచింగ్ కి విరాళంగా ఇచ్చారు జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్రానికి పట్టిన దరిద్రం వైసిపి పార్టీ

**ఆ భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తే తప్ప రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదు : ముఖ్యమంత్రి చంద్రబాబు**






**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంట్రాక్టర్ల కోసం మరెవరి కోసమో పని చేసే ప్రభుత్వం కాదని, పేద ప్రజలకు న్యాయం చేసే పరిపాలన తమదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం స్వర్ణ వానపల్లి సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అయినవిల్లి హెలీప్యాడ్ వద్ద శాసనసభ్యులు బండారు సత్యానందరావు ఎంపీ హరీష్ మాధుర్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి కోనసీమ కల్పవల్లి వానపల్లి గ్రామ దేవత శ్రీ పల్లాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసనసభ్యులు బండారు సత్యానందరావు అమ్మవారి విశిష్టతను ముఖ్యమంత్రికి తెలియజేశారు. అనంతరం స్వర్ణ కొత్తపేట, స్వర్ణ వానపల్లి గ్రామసభ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ మిత్రుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రం మొత్తం గ్రామసభలు పెట్టాలని చేసిన ఆలోచనలలో తాను భాగస్వామిని కావాలనే ఉద్దేశంతో వానపల్లికి రావడం జరిగిందన్నారు. గడిచిన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కానీ, ఉప ముఖ్యమంత్రి కానీ ప్రజలతో మమేకమైంది లేదని అన్నారు. గ్రామాల అభివృద్ధి దేశాభివృద్ధికి మూలమని వానపల్లి బాగుంటే అంబేద్కర్ కోనసీమ జిల్లా బాగుంటుందని, అంబేద్కర్ కోనసీమ జిల్లా బాగుంటే దేశం బాగుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. 9కోట్ల పని దినాలతో 54 లక్షల కుటుంబాలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కలగనుందన్నారు. 2019 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్లో చీకటి యుగం, చీకటి పాలన సాగి నరేగా నిధులు సైతం దోచుకున్నారని నాడు అమరావతిలో కూర్చున్న ఒక సైకో ఊరూరా ఒక సైకోను తయారు చేసి రాష్ట్రాన్ని అంధకారమయం చేశాడని అటువంటి వ్యక్తులు సమాజానికి చేటు అని పులివెందుల ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం వైసిపి పార్టీ అని ఆ భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తే తప్ప రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే వైసీపీని శాశ్వతంగా భూస్థాపితం చేసి, పైన కాంక్రీటు సైతం వెయ్యాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. సైకో పాలనకు విసుగు చెందిన ప్రజలు కూటమికి బ్రహ్మాండమైన విజయాన్ని కట్టబెట్టారని ప్రజలు తమపై పెట్టిన బాధ్యతను తప్పకుండా నెరవేరుస్తామని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని 243 ఏ గ్రామసభ గొప్పతనాన్ని సూచిస్తుందని, గ్రామంలో ప్రజల అవసరాల ప్రాతిపదిక మీదే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఆయన సూచించారు. తరువాత సభకు హాజరైన పలువురుతో సంభాషించారు. వారి సమస్యలను తెలుసుకొని అధికారులను పరిష్కరించమని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పల్లి భీమరావు, ఉపసర్పంచ్ గణిశెట్టి వీరేష్, రాయుడు రమాదేవి, మెడిద విజయ్ కుమార్, నేతల డాక్టర్ బాబు దునబోయిన ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల ద్వారానే గ్రామాల అభివృద్ధి

**బొలగొండ గ్రామ సభలో ఎంఎల్ఏ శిరీష వెల్లడి**

**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏజెన్సీలోని (పివిటిజి)ల గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలైన పథకాలు ప్రవేశపెట్ట డం జరిగిందని రంపచోడ వరం శాసనసభ్యులు శ్రీమతి మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. రంపచోడవరం మండలం బోలకొండ గ్రామంలో ( పివిటిజి) గ్రామాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా అభివృద్ధి చేయుట అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా ఏజెన్సీలోని అన్ని గ్రామాలు అభివృద్ధి కార్యక్రమాల సమావేశానికి రంపచోడవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా రంపచోడవరం శాసనసభ్యులు శ్రీమతి మిరియాల శిరీష శ్రీదేవి మాట్లాడుతూ ఏజెన్సీలోని మన గ్రామాలు అభివృద్ధి తీసుకొనే భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ అభివృద్ధికి పెద్దపీట వేయడం జరిగిందని ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీలో బిపివిటిజిలకు అభి వృద్ధి చేసే విధంగా వివిధ రకా లైన పథకాలు ప్రవేశ పెట్టడం జరి గిందని ఆమె తెలిపారు. గ్రామా నికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచుల అధ్యక్షతన తీర్మానాలు అందరు కలిసి కట్టుగా చేయాలని ఆమె అన్నారు. పార్టీ లకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఉపాధి పనులకు సంబంధించిన ఉపాధి వేతనాలు ఎప్పటికప్పుడు జనరేట్ చేసి పనులకు సంబంధించిన వేతనాలు చెల్లించాలని ఆమె అన్నారు. ఏజెన్సీలోని ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్న వారికి వంద రోజులు ఉపాధి పనులు కల్పించడం జరుగుతుం దని అదేవిధంగా అటవి హక్కుల చట్టం ద్వారా పట్టాలు పొందిన రైతులకు మరో 50 రోజులు ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు, వ్యక్తిగత లబ్ధినిచ్చే పనులు, రహదారులు, పంట కాలువలు, పొలం గట్లపై మొక్కలు, రైతుల భూములలో సేద్యం, నీటి కుంటలు, పండ్ల తోటల భూసార సంరక్షణ, రైతుల భూములలో గడ్డి పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం తదితరవి ఈ గ్రామ సభలో సర్పంచ్ అధ్యక్షతన తీర్మానాలు చేసుకొని పై అధికారులకు సమర్పించాలని ఆమె అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా



సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని పివిటిజిల గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలైన పథకాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ కార్యచరణలో చేపట్టడం జరిగిందని అదేవిధంగా (టీవీటీజీ)లకు అందరికీ పక్కా గృహాలు, ప్రతి ఇంటికి మంచినీటి కులాయి, గ్రామ గ్రామానికి రహదారులు, ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, అందరికీ న్యాయమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, అందరికీ పౌష్టికాహారం, జీవనోపాదులు మెరుగుపరచడం, ప్రచార సాధనాలు సౌకర్యం మెరుగుపరచడం, ఉచిత రేషన్( ఆహార సరుకులు), ఉచిత వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్, గర్భిణీ స్త్రీలకు ఆర్థిక సహాయం, గర్భిణి స్త్రీలకు ఆసుపత్రులు కాన్పులు, సికిల్ సెల్ ఎనీమియా నివారణ, పిల్లలకు 100% టీకాలు, టీవీ నిర్మూలన, మధ్యాహ్న భోజన పథకం అమలు, ప్రధానమంత్రి జన్ దన్ యోజన, సమృద్ధి యోజన పథకాలు అర్హులైన వారికి అమలు చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధికి వివిధ రకాలైన పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బోలకొండ పంచాయతీ సర్పంచ్ పల్లాల సీతమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీడి జి. శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో బి. సత్యనారాయణ, డాక్టర్ సాహిన్, పంచాయతీ కార్యదర్శి విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు

# ఘన స్వాగతం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్రామ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం హెలిక్యాప్టర్ ద్వారా రాజమండ్రి విమానాశ్రయం చేరుకొన్నారు. అనంతరం అక్కడ నుంచి చాపర్ లో హైదరాబాద్ బయలుదేరి వెళ్లడం జరిగింది. మధురపూడి విమానాశ్రయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అధికారులు ప్రజా ప్రతినిధులు ఘనవీడ్కోలు పలకడం జరిగింది. ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికిన వారిలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు, నాయకులు బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు ఉన్నారు.

## పురుషోత్తపట్నంలో ఫ్యామిలీ

# ఫిజీషియన్ ప్రోగ్రాం



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో గ్రామ సభ జరుగుతున్న సందర్భంలో ప్రభుత్వ వైద్యాధికారి ఎన్. రాజు ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం జరిగింది. ఉచితంగా బీపీ షుగర్ పలు రోగాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి ఎన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పి రత్నకుమారి, ఏఎన్ఎం పద్మజ్యోతి, ఆశాలు వెంకటలక్ష్మి, మేరీ కుమారి, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి (హామీ) పథకంలో

# గ్రామ సభల ద్వారా పనులు ఖరారు



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో గ్రామసభ జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కొత్తగా ప్రవేశపెట్టిన కార్యక్రమాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ గ్రామ సభ ద్వారా పుంత రోడ్లు, సిసి రోడ్లు, డ్రైన్లు, పంట కాలువల మరమ్మతులు, చెరువుల ఆధునీకరణ, మంచినీటి సమస్యలపై అప్లై చేసుకోవచ్చని పంచాయతీ సెక్రటరీ తెలియజేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత పాలకులు, అధికారులతో పాటు ప్రజలందరూ భాగస్వాములు అవ్వాలని తెలియజేశారు. ప్రజలందరూ భాగస్వామ్యం అవుతూ ముందుకు వెళితే ప్రతి పంచాయతీ అభివృద్ధి పదంలో కచ్చితంగా ముందుకు వెళుతుందని సంబంధించిన అధికారులు తెలియజేశారు. రైతులు ఎవరైనా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయించుకోవాలంటే గ్రామ సభ ద్వారా అప్లై చేసుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రెసిడెంట్, స్థానిక జనసేన టిడిపి బిజెపి సీనియర్ నాయకులు, వైసిపి నాయకులు, పంచాయతీ మెంబర్లు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, డ్వాక్రా యానిమేటర్స్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొనసీమ గ్రామ సభలో

# సీఎం చంద్రబాబు



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ సభలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట నియోజకవర్గం వానపల్లి గ్రామంలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతి కలిసి అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు కూటమి నాయకులు హాజరయ్యారు.



## బికినీతో పిచ్చెక్కించే అందం

యేమేరి లైఫ్ హై అనే హిందీ సీరియల్‌తో బుల్లి తెర ప్రేక్షకులకు చేరువ అయిన ముద్దుగుమ్మ షామా సికిందర్. ఈ అమ్మడు ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా ఏళ్లు అవుతున్న విషయం తెల్సిందే. నటిగా ఈ అమ్మడు ఇప్పటికి కూడా ప్రేక్షకులను అలరించేందుకు ప్రయత్నిస్తూనే ఉంది. ఈ మధ్య కాలంలో బుల్లి తెర కంటే ఎక్కువ సినిమాల్లో చేయాలని ఆసక్తి చూపిస్తున్న షామా సికిందర్ సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో పిచ్చెక్కిస్తుంది. రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేసే ముద్దుగుమ్మ తాజాగా అంతకు మించి అన్నట్లుగా నెట్టింట బికినీ ఫోటోలను షేర్ చేసింది. మ్యాగజైన్ పై హీటెక్కిస్తున్న తెలుగమ్మాయి ఎల్లో బికినీ లో ముద్దుగుమ్మ షామా సికిందర్ అందాలను చూస్తూ చూపు తిప్పుకోలేక పోతున్నాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నెట్టింట వైరల్ అవుతున్న ఈ ఫోటోలకు తెగ లైక్స్ మరియు షేర్స్ దక్కుతున్నాయి. బికినీ లో కూడా షామా చాలా అందంగా ఉందనే టాక్ వినిపిస్తోంది. నాలుగు పదుల వయసు దాటినా కూడా పాతికేళ్ల పడుచు అమ్మాయిలతో పోటీ అన్నట్లుగా ఈ అమ్మడు ఇలా బికినీ ట్రీట్ చేస్తే ఎంతటి వారు అయినా ఫిదా అవ్వాల్సిందే. ఈ స్థాయిలో అందాల విందు చేస్తున్న షామా సికిందర్ నెట్టింటనే కాకుండా సినిమాలతో కూడా బిజీ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

సినీ వాయిస్ CINEMA

## మంచి లైనప్‌తో కార్తీ దూకుడు



తమిళ స్టార్ హీరో సూర్య తమ్ముడిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పటికి తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను సొంతం చేసుకున్న హీరో కార్తీ. తమిళ స్టార్ హీరో సూర్య తమ్ముడిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పటికి తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను సొంతం చేసుకున్న హీరో కార్తీ. ప్రస్తుతం నలన్ కుమారస్వామి దర్శకత్వంలో వా వాతియారే అనే సినిమాలో కార్తీ నటిస్తున్న విషయం తెల్సిందే. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు. సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా ఉంటుంది అనే నమ్మకం ను మేకర్స్ మరియు చిత్ర యూనిట్ సభ్యులు బలంగా చెబుతున్నారు. వా వాతియారే సినిమా విడుదలకు ముందే కార్తీ 30వ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రముఖ దర్శకుడు తమీజ్ దర్శకత్వంలో కార్తీ సినిమా రూపొందబోతున్నట్లు తెలుస్తోంది. తమిళ మీడియాలో ప్రముఖంగా ఈ విషయమై కథనాలు వస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించబోతున్న కార్తీ 30 సినిమా ను 1960 నాటి పరిస్థితుల్లో రూపొందించబోతున్నారట. పీరియాడిక్ డ్రామాగా విభిన్నమైన గ్యాంగ్‌స్టర్ మూవీగా ఈ సినిమాను దర్శకుడు తమీజ్ రూపొందించబోతున్నాడు. కార్తీ వా వాతియారే, తమీజ్ సినిమాలతో పాటు పీఎస్ దర్శకత్వంలో సర్దార్ 2 ను చేసేందుకు ఓకే చెప్పాడు. త్వరలోనే ఆ సీక్వెల్ ప్రారంభం అవ్వబోతుంది. ఇక ఖైదీ 2 ను ఇప్పటికే దర్శకుడు లోకేష్ కనగరాజ్ మొదలు పెట్టేందుకు రెడీ అయ్యాడు. మొత్తానికి మంచి లైనప్ తో కార్తీ దూసుకు పోతున్నాడు.

## రీల్ లైఫ్, రియల్ లైఫ్.. పవన్ ఫుల్ మాస్




విజయ్ ఎన్నికల్లో 21కి 21 స్థానాల్లో తన పార్టీని గెలిపించి నేషనల్ వైడ్ గా చర్చనీయాంశంగా మారారు. సినిమాల్లోనే కాదు.. రాజకీయాల్లో కూడా తాను పవర్ స్టార్ అని పవన్ కళ్యాణ్ నిరూపించుకున్న విషయం తెలిసిందే. పదేళ్లకుపైగా రాజకీయాల్లో ఉన్న జనసేనాని.. ఈసారి ఎన్నికల్లో అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. పిఠాపురంలో భారీ మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రంలో టీడీపీ- జనసేన- బీజేపీ కూటమిగా ఏర్పడడానికి కీలక పాత్ర పోషించారు. ఎన్నికల్లో 21కి 21 స్థానాల్లో తన పార్టీని గెలిపించి నేషనల్ వైడ్ గా చర్చనీయాంశంగా మారారు. అయితే పవన్ కళ్యాణ్.. విజయం సాధించిన తర్వాత పెద్ద ఎత్తున ప్రశంసలు అందుకున్నారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆయనకు సంబంధించిన ట్వీట్లే కనిపించాయి. మెగాస్టార్ ఇంట్లో పవర్ విన్నింగ్ సెలబ్రేషన్స్ జరిగాయి. అనేక మంది సినీ ప్రముఖులు.. పవన్ కు బెస్ట్ విషెస్ తెలిపారు. భారీ విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి కూడా విషెస్ చెప్పారు. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లో కూడా ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న విజయ్ సేతుపతి నటిస్తున్న లేటెస్ట్ మూవీ మహారాజా రిలీజ్ కు సిద్ధమవుతోంది. తమిళంతో పాటు తెలుగులో కూడా ఈ మూవీ జూన్ 14వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్.. హైదరాబాద్ లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఓ జర్నలిస్టు అడగ్గా.. పవన్ విక్టరీపై స్పందించారు విజయ్. “పవన్ కు నా బెస్ట్ విషెస్ చెబుతున్నాను. ఆయన కష్టాన్ని గౌరవిస్తాను. ఎన్నికల్లో విజయం సాధించడం చాలా హ్యాపీగా ఉంది. ఆయన ఎలక్షన్స్ లో పోటీ చేస్తున్నప్పుడు చాలా ట్రోల్స్ వచ్చాయని విన్నాను. తొడ కొట్టిన వీడియో చూశాను. అప్పుడే రియల్ లైఫ్ లో కూడా ఆయన ఎంత మాసో అర్థమైంది. ఏం జరిగినా స్థిరంగా ఉండటం చాలా ముఖ్యం. ఎవరి కథలోనో ఆయన హీరో కాదు.. ఆయన కథలో ఆయనే హీరో” అని విజయ్ ప్రశంసలు కురిపించారు. “పవన్ సార్ గురించి నాకు పెద్దగా తెలియదు. కానీ నా వాట్సాప్ స్టేటస్ లో కొందరు తెలుగు వాళ్లు పెట్టిన పవన్ వీడియోస్ చూసి ఏమైందని అడిగాను. అప్పుడు వాళ్లు చాలా విషయాలు చెప్పారు. మీమ్స్, ట్రోల్స్, టీజింగ్ ను ఎవరైతే స్ట్రాంగ్ గా ఎదుర్కొంటారో.. వారు చాలా స్ట్రాంగ్ గా అని అర్థం. రీల్ లైఫ్ లోనే కాదు రియల్ లైఫ్ లో కూడా పవన్ మాస్. అన్నీ తట్టుకుని ఆయనంటే ఏంటో చూపించారు” అంటూ గొప్పగా మాట్లాడారు విజయ్ సేతుపతి. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి.

### హాసన్నబాధలో గ్రామంలో
## విజవంతమైన గ్రామ సభ



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్**

రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ ఉపాధిహామీ పథకంలో భాగంగా2024-25ఆర్థిక సంవత్సరం గాను హసన్ బాద గ్రామ పరిధిలో అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, చర్చించి ఆమోదించుట గురించి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఒకేరోజు అనగా 23వ తేదీన రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవణ్ కళ్యాణ్ ఆదేశానుసారం గ్రామసభలు ఏర్పాటు చెయ్యడమైనది.అందులో భాగంగా హసన్ బాద గ్రామ పంచాయతీ లో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది.మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో 36 సాధారణ పనులతో పాటు వ్యవసాయ అనుబంధ పనులు గురించి చర్చించడం జరిగింది. రోడ్లు,డ్రైనేజీ,పారిశుధ్యం, ఎలక్ట్రికల్,వాటర్ సమస్యలను గుర్తించి గ్రామ ప్రజల సమక్షంలో అమోదించడమైనది.సర్పంచ్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవణ్ కళ్యాణ్ పంచాయతీలను బలోపేతం చేసే విధంగా అడుగులు వేయడం పంచాయితీ వ్యవస్థకు శుభపరిణామం అని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసారు.గ్రామంలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ భాస్కర లక్ష్మి, వీఆర్వో సూర్య కుమారి,ఉప సర్పంచ్ నీలం భవాని,వార్డ్ సభ్యులు కత్తుల బాలకృష్ణ, చోడిశెట్టి పాండురంగారావు,కొండాయపాలెపు వీరబాబు, గ్రామ పెద్దలు చోడిశెట్టి భద్రరావు,చెక్కా సోమరాజు,బిజెపి నాయకులు దొంతంశెట్టి ఓం ప్రకాష్,సూరంపూడి సుబ్బారావు,కత్తుల వెంకట రమణ,గ్రామ ప్రజలు, డ్వాక్రా మహిళలు, రైతులు,ఫీల్డ్ అసిస్టెంట్ వజ్రపు బాబీ,పంచాయితీ సిబ్బంది, అంగన్వాడీ,సచివాలయం,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విజయవంతంగా రాజోలులో
## ఒకే రోజు 13,326 గ్రామ సభలు



**రాజోలు, విశ్వంవాయిస్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కోసం ఒకే రోజు 13,326 గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసి ఉన్నారు.రాజోలు గ్రామసభ రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన రాజోలు గ్రామపంచాయతీ పరిధిలో డ్రైన్లు,సిసి రోడ్లు, వివిధ అంశములపై చర్చించారు.ఈ కార్యక్రమానికి నోడల్ అధికారి,రాజోలు ఎమ్మార్వో గ్రామ సర్పంచ్ రేవు జ్యోతి,ఉపసర్పంచ్ పామర్తి రమణ, పంచాయతీ కార్యదర్శి రెహమాన్,టిడిపి గ్రామ శాఖ అడబాల విజయ్, జనసేన గ్రామ శాఖ కాటన్ రాజు,ముఖ్యనాయకులు బోళ్ల వెంకటరమణ, బొమ్మిడి మహేష్,వార్డు మెంబర్లు,పంచాయతీ సిబ్బంది ,సచివాలయం సిబ్బంది మరియు కూటమి సభ్యులు పాల్గొన్నారు.

### చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రత్న మాణిక్యం తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్. ప్రిన్సిపల్ ముల్లిశేఖర్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రునిపై మొట్టమొదటిసారిగా దక్షిణ ధ్రువంలో అడుగుపెట్టడం మన భారతదేశం కావడం విశేషమని, గత సంవత్సరం చంద్రయన్-3 జూలై 14 న ప్రారంభం అయ్యి ఆగస్టు 23, 6 గం%××%,4 ని%××% చేరుకోవడం జరిగిందని, చంద్రయాన్ -3, ఆగస్ట్ 23న రోవర్ 7 రోజులు పనిచేసి విక్రమ్ ల్యాండ్ రోవర్ దక్షిణ ధ్రువంలో హైడ్రోజన్, సల్ఫర్,కాల్షియమ్, హిలియం కనుగొనడం జరిగిందన్నారు. చంద్రయాన్ -3 మన భారతదేశం విజయం సాధించడం వలన అనేక దేశాలు ప్రశంసించాయన్నారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు దీని గురించి చాలా విషయాలు నేర్చుకుని , ప్రాజెక్టులు, అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆంగ్ల అధ్యాపకులు సిహెచ్.ఆర్.నాగేశ్వరరావు మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఇస్రో చిన్న సాటిలైట్ సైకిల్ ద్వారా పయనం చేసి, మూడవసారి మంచి ఫలితాన్ని సాధించిందని, ఒకేసారి 108 సాటిలైట్లు, ఒక్కసారే అంతరిక్షంలో పంపించిందని, ప్రస్తుతం మన టెక్నాలజీని వినియోగించుకొని చంద్రయాన్ -3 విజయం సాధించిందన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ అధ్యాపకులు నూనె రమేష్ మాట్లాడుతూ స్పేస్ అనేది ఒక అనంతమని, ఇండియాలోనే ఆర్యభట్ట ద్వారా స్పేస్ రీసెర్చ్ చేయాలని, చిన్న సాటిలైట్ తో మొదలు పెట్టిందని, చంద్రయాన్ -3 ఫలితం సాధించడానికి 4,500 కోట్లు, బాలీవుడ్ మూవీ తీసే అంత బడ్జెట్ ని ఖర్చుపెట్టి చంద్రుడిలో దక్షిణ ధ్రువంలో ఏముందో తెలుసుకోవడానికి, ప్రజ్ఞన్ రోవర్ ద్వారా అనేక విషయాలు అందించడానికి మన దేశం కావడం గర్వకారణం అన్నారు. అలాగే చిన్న కవితను విద్యార్థులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.వై.పద్మ,జి.హారతి, కె.శకుంతల, ఎస్.అప్పనమ్మ, కె.శైలజ, ఆర్ సిచ్.రాజబాబు, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఆర్.మౌనిక,జి.సాయికుమార్, పి.అలివేలు అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీడి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం జిల్లా పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153 వ జయంతి వేడుకలు తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఆర్. రాజశేఖర్ రాజు ఘనంగా నిర్వహించారు.జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఆర్. రాజశేఖర్ రాజు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించినారు.

ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ( అడ్మిన్) టంగుటూరి ప్రకాశం పంతులుని స్మరించుకుంటూ, వారి గురించి మాట్లాడుతూ...తన దేశం కోసం పోలీసు తుపాకీ ‘గుండుకెదురుగా గుండెనిలిపి ’ఆంధ్రకేసరి’గా జేజేలు అందుకున్న ప్రకాశం పంతులు సాహసం నేటి యువతకు స్ఫూర్తి కావాలన్నారు. నిర్భీతి, నిజాయితీ, నిబద్ధత, నిరుపేదల పట్ల పక్షపాతం వంటి సుగుణాలే వారిని ప్రజా జీవితంలో సింహంలా నిలబెట్టాయి అని, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆ మహనీయుని దేశభక్తిని, త్యాగనిరతిని,సాహసోపేతమైన ప్రజా జీవితాన్ని స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఎస్పి (అడ్మిన్) ఎస్.ఆర్.రాజశేఖర్ రాజు, ఏవో ,డిపిఓ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com